'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి ‖ సంపుటి : 1 ‖ సంచిక : 68 ‖ శుక్రవారం ‖ 23.10.2026 ‖ పేజీలు : 8 ‖ వెల రూ. 2

Medchal Malkajgiri ‖ Volume: 1 ‖ Issue: 68 ‖ Friday ‖ 23.10.2026 ‖ Pages: 8 ‖ Rate: 2

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..



## లక్షకు పైగా జీవోలు గల్లంతు!

### 58.5 శాతం ఉత్తర్వులు ఎక్కడ?

**ప్రజలకు తెలియని ప్రభుత్వ నిర్ణయాలు!**

**ప్రభుత్వ నిర్ణయాలు గోప్యంగా ఎందుకు?**

**పారదర్శకతపై హైకోర్టులో న్యాయపోరాటం**

తెలంగాణలో ప్రభుత్వ నిర్ణయాల వెనుక ఏం జరుగుతోంది? ప్రజల కోసం తీసుకున్న నిర్ణయాలే ప్రజలకు తెలియకుండా ఉంటే.. పాలనలో పారదర్శకత ఎక్కడున్నట్లు? రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి జారీ చేసిన 1,99,115 ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఏకంగా 1,16,458 జీవోలు ప్రజల పరిశీలనకు అందుబాటులో లేవన్న గణాంకాలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. అంటే దాదాపు 58.5 శాతం ప్రభుత్వ ఉత్తర్వులు పబ్లిక్ డొమైన్‌లో లేవు! బీఆర్ఎస్ పదేళ్ల పాలన నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలన వరకు కొనసాగుతున్న ఈ పరిస్థితిపై బి. వినయ్ రెడ్డి హైకోర్టు తలుపు తట్టారు. (వివరాలు 3లో..)



## రాహుల్ గాంధీపై మోదీ నిప్పులు

**నాయకత్వంపై ఘాటు వ్యాఖ్యలు**

**ప్రపంచం కొత్త వ్యవస్థ వైపు**

**భారత్‌లో మాత్రం అరాచకం?**

ప్రపంచమంతా కొత్త అంతర్జాతీయ వ్యవస్థ కోసం ఎదురుచూస్తుంటే.. భారత్‌లో కొందరు మాత్రం అస్తవ్యస్త పరిస్థితులను కోరుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. గురువారం జరిగిన ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2026 ప్రారంభ కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. (3లో..)



## బ్రూక్ డబుల్ సెంచరీ.. రికార్డుల బద్దలు!

బ్యాట్ ఝుళిపించాడు.. బౌండరీల వర్షం కురిపించాడు.. రికార్డుల పుస్తకాన్ని తిరగరాశాడు! ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ వన్డే క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తూ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. శ్రీలంకతో జరిగిన పోరులో కేవలం 114 బంతుల్లో ద్విశతకం బాది పురుషుల వన్డేల్లో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. (వివరాలు 8లో..)




## 430 పరుగుల ఛేదన.. లంక చరిత్ర!

క్రికెట్ చరిత్రలో అసాధ్యమనుకున్న లక్ష్యం.. శ్రీలంక వీరుల ముందు తలవంచింది! ఇంగ్లండ్ 429 పరుగుల కొండంత స్కోరు సాధించి విజయంపై ధీమాగా కనిపిస్తే.. లంక బ్యాటర్లు మాత్రం పోరాటమే ఊపిరిగా బరిలోకి దిగారు. ఫలితం.. ప్రపంచ క్రికెట్‌ను విస్మయానికి గురిచేసిన రికార్డు విజయం! హ్యారీ బ్రూక్ విధ్వంసక ద్విశతకం, జో రూట్ అర్ధశతకం, విల్ జాక్స్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఇంగ్లండ్ పరుగుల వరద పారించింది. (వివరాలు 8లో..)



# ముదిరాజులకు అండగా ఉంటా.. హక్కులు కల్పిస్తా!

- **పేదల పక్షాన పోరాడిన యోధుడు పండుగ సాయన్న**
- **బీసీ-ఏ వర్గీకరణపై కేబినెట్‌లో చర్చిస్తామన్న సీఎం**

పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. కొడంగల్ నియోజకవర్గంలో ముదిరాజుల జనాభా ఎక్కువగా ఉందని, వారు విశ్వసనీయమైన వారని పేర్కొన్నారు. నిజాం పాలనలో దొరలు పేదల భూములను ఆక్రమిస్తుంటే పండుగ సాయన్న ఎదురుతిరిగి నిలబడ్డారని గుర్తుచేశారు. దొరలకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి పేదలకు అండగా నిలిచారని వివరించారు. పేదలకు ధాన్యం పంచడంతో పాటు నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేసిన గొప్ప వ్యక్తి సాయన్న అని ప్రశంసించారు. నిజాం పోలీసులు ఆయనను అరెస్టు చేసినప్పుడు వనపర్తి మహారాణి పెద్ద మొత్తంలో నిధులు చెల్లించి విడిపించారని తెలిపారు. చివరకు ఆయన అన్యాయంగా హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వందేళ్లు దాటినా నాట్లు, కోతల సమయంలో సాయన్న పాటలు వినిపిస్తుండటం ఆయన ప్రజల హృదయాల్లో నిలిచిపోయారనడానికి నిదర్శనమన్నారు. (వివరాలు 2లో..)

## ఎమ్మెల్సీ ఎన్నికలపై కేటీఆర్ ఫోకస్

**ఆరు జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జీలు**

తెలంగాణలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణను వేగవంతం చేసింది. ఖమ్మం-వరంగల్-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జీలను నియమించింది. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఎన్నికల సమీక్ష సమావేశం అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నియామకాలను ప్రకటించారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ నాయకత్వం.. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పట్టభద్రుల ఓటర్లను చేరుకోవడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, ఎన్నికల ప్రచారాన్ని సమర్థంగా నిర్వహించడం వంటి అంశాలపై దృష్టి సారించింది. (వివరాలు 2లో..)






## పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

» **క్వింటాల్‌కు రూ. 8,667 కనీస మద్దతు ధర**
» **కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తుమ్మల ఆదేశం**

తెలంగాణలో 2026-27 ఖరీఫ్ సీజన్ పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం సన్నద్ధమైంది. కొనుగోలు కేంద్రాలను గత ఏడాది తరహాలో ఏర్పాటు చేసి, రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సీసీఐ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సీజన్‌లో తెలంగాణలో 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,667 కాగా, రాష్ట్రంలో మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9,000గా ఉంది. (వివరాలు 2లో..)

# రేవంత్ చేతికి గుచ్చుకొని గులాబీ ముల్లు




## రెండు పార్టీల మధ్య కుదిరిన రహస్య డీలు..!

- **అనుముల చేతిలో కార్ స్టీరింగ్**
- **కల్వకుంట్ల ఫ్యామిలీతో సీఎం మ్యాచ్ ఫిక్సింగ్..!?**
- **ధర్మపురి అరవింద్ పొలిటికల్ బ్రేకింగ్**

తెలంగాణ రాజకీయాల్లో ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలు ఒక్కసారిగా వేడి పెంచాయి. సాగునీటి ప్రాజెక్టుల డిజైన్ల మార్పుల వెనుక భారీ అవినీతి ఉందని ఆరోపించిన ఆయన.. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇంతటితో ఆగని అర్వింద్.. కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన ముఖ్యమంత్రి కాలేరంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు రేవంత్ రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉందని వ్యాఖ్యానించి కొత్త చర్చకు తెరలేపారు. అసలు కేసీఆర్, రేవంత్ మధ్య తెరవెనుక ఏదైనా రాజకీయ అవగాహన ఉందా? కాంగ్రెస్, బీఆర్ఎస్ భవిష్యత్తులో చేతులు కలుపుతాయా? కేటీఆర్ నాయకత్వంపై అర్వింద్ ఎందుకు గురిపెట్టారు? ఈ ప్రశ్నలన్నింటికీ తనదైన రాజకీయ అంచనాలతో సమాధానాలు చెప్పే ప్రయత్నం చేశారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను రాజకీయంగా గల్లంతు చేస్తామని, బీజేపీ సునామీ సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాటల యుద్ధం నుంచి ఎన్నికల సమరానికి ఇప్పుడే సంకేతాలిస్తున్నారా? అర్వింద్ వ్యాఖ్యల వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇవి సంకేతాలా?

## కేసీఆర్-రేవంత్ కుమ్మక్కు

### అరవింద్ సంచలన ఆరోపణలు!

తెలంగాణలో రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. క్రాప్ హాలిడే ప్రకటించే ముందు రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల డిజైన్ల మార్పుల వెనుక భారీ అవినీతి ఉందని ఆరోపించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారని, భవిష్యత్తులో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే అవకాశముందని వ్యాఖ్యానించారు. కేటీఆర్ గడ్డం పెంచుకున్నంత మాత్రాన ముఖ్యమంత్రి కాలేరని ఎద్దేవా చేశారు. రేవంత్ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని పేర్కొన్నారు. (వివరాలు 2లో..)



## పంజాబ్‌లో ఎన్డీఏదే అధికారం

### విపక్షాలకు అమిత్ షా సవాల్!



దేశ రాజధాని ఢిల్లీలో యమునా నదిని ప్రక్షాళన చేసేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 22న శ్యామ్ విహార్‌లో ఢిల్లీ జల్ బోర్డుకు చెందిన 43 ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. (వివరాలు 3లో..)



## ఎల్‌నినో వచ్చినా కరెంట్ కష్టాలు రావొద్దు!

**కొరతకు చెక్.. ఉత్పత్తి పెంపునకు కార్యాచరణ**

**రోజుకు 140 మిలియన్ యూనిట్ల విద్యుత్ లక్ష్యం**

**యాదాద్రి ప్లాంట్‌పై భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి**

ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా, రానున్న రబీ, వేసవి సీజన్లలో విద్యుత్ కొరత తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిలపై నిర్వహించిన సమీక్షలో రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

## ఎల్‌నినో పేరుతో శిక్ష రైతులపై సర్కార్ కక్ష

- **నాడు కేసీఆర్ రక్షణ కవచం**
- **నేడు రేవంత్ రైతుల పాలిట శాపం!**
- **ఎండిన పంటలపై హరీశ్ రావు ఆగ్రహం**



ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. కరోనా విపత్తు సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు రక్షణ కవచంలా నిలిచారని, ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కరోనా సమయంలో ప్రజల్లో ధైర్యం నింపిన కేసీఆర్.. కష్టకాలంలోనూ రైతులకు నిరంతర విద్యుత్, సాగునీరు అందించారని గుర్తుచేశారు. (వివరాలు 2లో..)

## కాళేశ్వరం విచారణలో అసలు నిజం దాచేస్తున్నారు?

### సీఎం రేవంత్ రెడ్డిపై ఎంపీ రఘునందన్ రావు ఫైర్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సవాల్ విసిరారు. ముందుగా తన సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో తనకు ఎన్ని ఓట్లు పడ్డాయో వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి ప్రమాణం చేసి చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ మంత్రుల సొంత గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని విమర్శించారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి నోట్ల కట్టలు మోయడమే కాంగ్రెస్ పనిగా మారిందని ఆరోపించారు. (2లో..)



## జలమండలి సమ్మెలకు బ్రేక్

### మరో ఆరు నెలలు నిషేధం!

**ఎస్మా ప్రయోగం, ప్రభుత్వం ఆంక్షలు**

**నీటి సరఫరాకు ఆటంకం రాకుండా చర్యలు**

హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల సేవలకు అంతరాయం కలగకుండా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) పరిధిలో సమ్మెలపై నిషేధాన్ని మరో ఆరు నెలలు పొడిగించింది. (2లో..)

# ఎల్‌నినో వచ్చినా కరెంట్ కష్టాలు రావొద్దు!

- కొరతకు చెక్.. ఉత్పత్తి పెంపునకు కార్యాచరణ
- రోజుకు 140 మిలియన్ యూనిట్ల విద్యుత్ లక్ష్యం
- యాదాద్రి ప్లాంట్‌పై భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి



ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినా, రానున్న రబీ, వేసవి సీజన్లలో విద్యుత్ కొరత తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిలపై నిర్వహించిన సమీక్షలో రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని 140 మిలియన్ యూనిట్లకు పెంచాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం సగటు ఉత్పత్తి 90.97 మిలియన్ యూనిట్లకు చేరిందని అధికారులు తెలిపారు. అక్టోబర్ 16న ఒక్కరోజే 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైందని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ఉత్పత్తిలో సుమారు 19 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు.

### యాదాద్రి ప్లాంట్ బలోపేతం

విద్యుత్ ఉత్పత్తి పెంపులో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కీలకమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్లాంట్‌లోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే పనిచేస్తుండగా, ఐదో యూనిట్‌ను అక్టోబర్ 20న గ్రిడ్‌కు అనుసంధానించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన సాంకేతిక సమస్యలను పరిష్కరించి, ఆ యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకురావాలని సూచించారు. బొగ్గు సరఫరాలో అంతరాయం లేకుండా కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నవంబర్ నుంచి ఈ మార్గంలో బొగ్గు సరఫరా ప్రారంభం కానుంది. అన్ని థర్మల్ యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

### మూతపడిన పరిశ్రమలకు ఊరట

తెలంగాణలో మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిల పరిష్కారానికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని పరిశీలించి, సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. పరిశ్రమల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి, అర్హులకు చెల్లింపుల్లో వెసులుబాటు కల్పించే అవకాశాలను వివరించాలని టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీలకు సూచించారు. ఈ విధానం ద్వారా వినియోగదారులకు ఉపశమనం కలగడంతో పాటు పంపిణీ సంస్థలకు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కోకు రావాల్సిన బకాయిలను కూడా వసూలు చేయాలని ఆదేశించారు. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా ఉత్పత్తి, ప్రసారం, సరఫరా వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ముదిరాజులకు అండగా ఉంటా.. హక్కులు కల్పిస్తా!

- పేదల పక్షాన పోరాడిన యోధుడు పండుగ సాయన్న
- బీసీ-ఏ వర్గీకరణపై కేబినెట్‌లో చర్చిస్తామన్న సీఎం



వందేళ్లు దాటినా నాట్లు, కోతల సమయంలో సాయన్న పాటలు వినిపిస్తుండటం ఆయన ప్రజల హృదయాల్లో నిలిచిపోయారనడానికి నిదర్శనమన్నారు.

### బీసీ-ఏ వర్గీకరణపై కేబినెట్‌లో చర్చ

ముదిరాజులను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చే అంశంపై వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చిస్తామని సీఎం ప్రకటించారు. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి సమగ్ర అధ్యయనం చేయిస్తామని చెప్పారు. కుల గణనలో సరైన వివరాలు లేకపోవడం వల్లే గతంలో ఈ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. కుల గణనలో తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే ఆధారాలతో వివరాలు అందించాలని, పరిశీలించి అవసరమైన సవరణలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర కులాల్లో ఉన్న అపోహలను తొలగించిన తర్వాతే ఈ అంశంపై ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని, బీసీ కుల గణన చేపట్టామని గుర్తుచేశారు. ముదిరాజ్ నేత శ్రీహరి ముదిరాజ్‌కు డీసీసీ అధ్యక్ష పదవి, ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి మంత్రిని చేశానని తెలిపారు. నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చామని పేర్కొంటూ, ముదిరాజులకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. ప్రభుత్వంలో ముదిరాజులకు భాగస్వామ్యం కల్పించే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు.

### సంక్షేమంలో రెట్టింపు.. చరిత్రకు సముచిత గౌరవం

గత ప్రభుత్వాలు అమలు చేసిన మంచి పథకాలను కొనసాగిస్తూనే సంక్షేమాన్ని రెట్టింపు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ రెండు రూపాయలకే కిలో బియ్యం అందిస్తే, తమ ప్రభుత్వం 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తోందని వివరించారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న వంటి పోరాట యోధుల చరిత్రను మరుగున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తామని ప్రకటించారు. పండుగ సాయన్న, గద్దర్, అందెశ్రీ వంటి వారు సమాజం కోసమే జీవితాలను అంకితం చేశారని కొనియాడారు. బ్రిటిష్ కాలం తర్వాత తమ ప్రభుత్వం కుల గణన చేపట్టి బహుజనుల గొంతుకు బలం కల్పించిందన్నారు. బహుజనుల జీవితాల్లో మార్పు రావాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని, రాబోయే ఎన్నికల్లో ఆయనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై కేటీఆర్ ఫోకస్

### ఆరు జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జీలు



తెలంగాణలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణను వేగవంతం చేసింది. ఖమ్మం-వరంగల్-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గాలకు ప్రత్యేక ఇన్‌ఛార్జీలను నియమించింది. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఎన్నికల సమీక్ష సమావేశం అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నియామకాలను ప్రకటించారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ నాయకత్వం.. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పట్టభద్రుల ఓటర్లను చేరుకోవడం, పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, ఎన్నికల ప్రచారాన్ని సమర్థంగా నిర్వహించడం వంటి అంశాలపై దృష్టి సారించింది.

### ఆరు జిల్లాల్లో సమన్వయ బాధ్యతలు

ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని ఆరు జిల్లాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లే బాధ్యతలను కేటీఆర్ ఇన్‌ఛార్జీలకు అప్పగించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమీకరించడం, పట్టభద్రులతో సంబంధాలు పెంచుకోవడం, ఎన్నికల సన్నద్ధతను పర్యవేక్షించడం వంటి అంశాల్లో వీరు కీలక పాత్ర పోషించనున్నారు. రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో పటిష్ఠమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశం. అయితే, నియమితులైన ఇన్‌ఛార్జీల పేర్ల వివరాలు అందించిన కథనంలో వెల్లడించలేదు.

# ఎల్‌నినో పేరుతో శిక్ష

- రైతులపై సర్కార్ కక్ష
- నాడు కేసీఆర్ రక్షణ కవచం
- నేడు రేవంత్ రైతుల పాలిట శాపం!
- ఎండిన పంటలపై హరీశ్ రావు ఆగ్రహం



ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. కరోనా విపత్తు సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు రక్షణ కవచంలా నిలిచారని, ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కరోనా సమయంలో ప్రజల్లో ధైర్యం నింపిన కేసీఆర్.. కష్టకాలంలోనూ రైతులకు నిరంతర విద్యుత్, సాగునీరు అందించారని గుర్తుచేశారు. యూరియా కొరత రాకుండా విశాఖపట్నం పోర్టులో ప్రత్యేక అధికారులను నియమించి ఎరువులు తెప్పించడంతో పాటు, బీహార్ నుంచి ప్రత్యేక రైళ్లలో హమాలీలను రప్పించి వ్యవసాయ పనులకు సహకరించారని తెలిపారు. ఇన్ని సవాళ్ల మధ్య కూడా కోటి టన్నుల పంట దిగుబడి సాధించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు.

### ఎల్‌నినో సాకుతో క్రాప్ హాలిడేనా?

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎల్‌నినో పేరుతో చేతులెత్తేసిందని హరీశ్ రావు ఆరోపించారు. రైతులకు సాగునీరు అందించాల్సిన బాధ్యతను విస్మరించి, క్రాప్ హాలిడే ప్రకటించడం దారుణమని మండిపడ్డారు. "పైసలు పెడితే నీళ్లు దొరుకుతాయా?" అంటూ రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు రైతుల కష్టాలను ఎగతాళి చేసేలా ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సరఫరా సరిగా లేక తక్కువ వోల్టేజీ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయని చెప్పారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వం, రైతులను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు.

### మూడెకరాల్లో సాగు.. అర ఎకరమే మిగిలింది!

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. మూడు ఎకరాల్లో పంట సాగు చేసినా నీళ్లు అందక కేవలం అర ఎకరంలో మాత్రమే పంట మిగిలిందని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రైతులకు సమయానికి సాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పంటలు కళ్లముందే ఎండిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రైతులకు భరోసా కల్పించి, సాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు దెబ్బతిన్న పంటలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైతే బీఆర్ఎస్ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

# కాళేశ్వరం విచారణలో అసలు నిజం దాచేస్తున్నారు?

**సీఎం రేవంత్ రెడ్డిపై ఎంపీ రఘునందన్ రావు ఫైర్**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సవాల్ విసిరారు. ముందుగా తన సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో తనకు ఎన్ని ఓట్లు పడ్డాయో వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి ప్రమాణం చేసి చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ మంత్రుల సొంత గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని విమర్శించారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి నోట్ల కట్టలు మోయడమే కాంగ్రెస్ పనిగా మారిందని ఆరోపించారు. అస్సాం ఉప ఎన్నికల్లో 75 శాతానికి పైగా ముస్లిం ఓటర్లు ఉన్న ప్రాంతంలోనూ బీజేపీ దాదాపు 50 శాతం ఓట్లతో విజయం సాధించిందని, కాంగ్రెస్‌కు కనీసం 10 శాతం ఓట్లు కూడా రాలేదని పేర్కొన్నారు. పెయిడ్ ప్రచారం, యూట్యూబ్ ఛానెళ్ల ద్వారా ఎంత తప్పుడు ప్రచారం చేసినా ప్రజలు నమ్మడం లేదని ఈ ఫలితాలు నిరూపించాయని రఘునందన్ రావు వ్యాఖ్యానించారు.

### బీజేపీ నేతల అరెస్టులు.. రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి!

తెలంగాణలో బీజేపీ నేతలు నిరసనలకు దిగితే అరెస్టులు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై రఘునందన్ రావు మండిపడ్డారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో బీజేపీ నాయకుల అరెస్టులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శాంతియుత నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, అయితే చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పార్లమెంట్ వైపు బారికేడ్లు దాటి దాడికి ప్రయత్నిస్తే పోలీసులు చూస్తూ ఊరుకోరని వ్యాఖ్యానించారు. 1975 అత్యవసర పరిస్థితుల్లో ఇందిరా గాంధీ ప్రభుత్వం ప్రతిపక్షాలను అణచివేసిన తీరును రాహుల్ గుర్తుచేసుకోవాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వెళ్లిన ఏబీవీపీ విద్యార్థులను తెలంగాణ, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాలు అరెస్టు చేసినప్పుడు ప్రజాస్వామ్య హక్కులు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.

### కాళేశ్వరం విచారణలో అసలు నిజం దాచేస్తున్నారా?

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నిస్తున్నారని రఘునందన్ రావు గుర్తుచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలపై సమగ్ర విచారణకు బదులుగా ఒక్క బ్యారేజీపై మాత్రమే విచారణ కోరడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అండగా ఉన్న కాంట్రాక్టర్లను కాపాడేందుకే విచారణకు పూర్తిస్థాయిలో సహకరించడం లేదని ఆరోపించారు. విదేశీ శక్తులతో కాంగ్రెస్ చేతులు కలిపి ప్రధాని నరేంద్ర మోదీపై తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని అడ్డుకోవాల్సిందేనని పేర్కొంటూ, ప్రజాస్వామ్య హక్కుల పేరుతో చట్టాన్ని ఉల్లంఘించడాన్ని సహించబోమని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# జలమండలి సమ్మెలకు బ్రేక్

- మరో ఆరు నెలలు నిషేధం!
- ఎస్మా ప్రయోగం, ప్రభుత్వం ఆంక్షలు
- నీటి సరఫరాకు ఆటంకం రాకుండా చర్యలు

హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల సేవలకు అంతరాయం కలగకుండా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) పరిధిలో సమ్మెలపై నిషేధాన్ని మరో ఆరు నెలలు పొడిగించింది. తెలంగాణ అత్యవసర సేవల నిర్వహణ చట్టం-1971 (ఎస్మా)లోని సెక్షన్ 3(1) ప్రకారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 21, 2026 నుంచి 2027 ఏప్రిల్ 20 వరకు ఈ నిషేధం అమల్లో ఉంటుంది. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### గత ఉత్తర్వుల గడువు ముగియడంతో పొడిగింపు

జలమండలిలో సమ్మెలపై ప్రభుత్వం గతంలో ఏప్రిల్ 2న ఉత్తర్వులు జారీ చేయగా, ఆరు నెలల నిషేధం అక్టోబర్ 20తో ముగిసింది. ఈ నేపథ్యంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ సెప్టెంబర్ 29న ప్రభుత్వానికి లేఖ రాశారు. పరిస్థితిని పరిశీలించిన ప్రభుత్వం నిషేధాన్ని మరో ఆరు నెలలు కొనసాగించాలని నిర్ణయించింది. నీటి సరఫరా, పంపిణీకి సంబంధించిన సేవలను అత్యవసర సేవలుగా పరిగణిస్తూ ఈ చర్య చేపట్టింది. 2016 జూన్ 1న జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 45 ద్వారా తెలంగాణకు వర్తింపజేసిన చట్ట నిబంధనల ఆధారంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపింది. తాజా నోటిఫికేషన్‌ను తెలంగాణ అసాధారణ గెజిట్‌లో ప్రచురించాలని ఆదేశించింది. ఉత్తర్వులను అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీకి సూచించింది.



# కేసీఆర్-రేవంత్ కుమ్మక్కు

**అరవింద్ సంచలన ఆరోపణలు!**

కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారని, భవిష్యత్తులో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసే అవకాశముందని వ్యాఖ్యానించారు. కేటీఆర్ గడ్డం పెంచుకున్నంత మాత్రాన ముఖ్యమంత్రి కాలేరని ఎద్దేవా చేశారు. రేవంత్ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని పేర్కొన్నారు.

### 2029లో బీజేపీదే అధికారం.. పసుపుకు భారీ ధర!

2029 ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను రాజకీయంగా గల్లంతు చేస్తామని అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ భారీ విజయం సాధిస్తుందని, ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ చేపడతామని తెలిపారు. ముఖ్యంగా పసుపు రైతులకు క్వింటాల్‌కు రూ.50 వేల ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ఈ హామీపై బాండ్ పేపర్ రాసి ఇస్తానన్నారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలు నిలిచిపోయాయని ఆరోపించారు. నిజామాబాద్‌లోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం త్వరలో ఆందోళన చేపడతామని ప్రకటించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. రైతుల పరిహారం, పసుపు ధరలు, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే బ్రిడ్జి నిర్మాణం అంశాలపై అరవింద్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

# పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం



- క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తుమ్మల ఆదేశం

తెలంగాణలో 2026-27 ఖరీఫ్ సీజన్ పత్తి కొనుగోళ్లకు ప్రభుత్వం సన్నద్ధమైంది. కొనుగోలు కేంద్రాలను గత ఏడాది తరహాలో ఏర్పాటు చేసి, రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సీసీఐ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సీజన్‌లో తెలంగాణలో 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,667 కాగా, రాష్ట్రంలో మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9,000గా ఉంది. మార్కెట్ ధర తగ్గితే సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకునే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 133 సీసీఐ కొనుగోలు కేంద్రాల కోసం 30 జిల్లాల్లో 335 జిన్నింగ్ మిల్లులను గుర్తించారు. నాణ్యత పరీక్షలు, తేమ శాతం పరిశీలన, రవాణా, సకాలంలో చెల్లింపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

### ధరల వ్యత్యాసంపై అధ్యయనం.. డిజిటల్ సేవలతో సౌలభ్యం

గుజరాత్, మహారాష్ట్రతో పోలిస్తే తెలంగాణలో పత్తి ధరలు కొన్ని మార్కెట్లలో తక్కువగా ఉండటానికి కారణాలను విశ్లేషించాలని తుమ్మల ఆదేశించారు. రాష్ట్రంలో పత్తి ప్రాసెసింగ్, స్పిన్నింగ్, ఆయిల్ పరిశ్రమల విస్తరణకు ప్రోత్సాహకాలు, రాయితీలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ధరలు, కొనుగోళ్ల పురోగతిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కపాస్ కిసాన్ యాప్‌లో 12,75,185 మంది రైతులకు సంబంధించిన 21,58,938 వివరాలు అనుసంధానమయ్యాయి. రైతులు తమ వివరాలను పరిశీలించి, స్లాట్ బుకింగ్‌కు ముందు నమోదు సరిచూసుకోవాలని సూచించారు. అదనపు దిగుబడి ధ్రువీకరణకు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించవచ్చు. కౌలు రైతులు కూడా అవసరమైన పత్రాలతో నమోదు చేసుకోవాలి. సహాయం కోసం 18005995779 టోల్‌ఫ్రీ నంబర్, 8897281111 వాట్సాప్ సేవలు అందుబాటులో ఉన్నాయి. రైతు వేదికల్లో తేమ పరీక్ష పరికరాలు, మార్కెట్ యార్డుల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. మార్కెట్ ధరను పరిశీలించి, గిట్టుబాటు ధర లభించే చోట పత్తి విక్రయించాలని రైతులకు సూచించారు.

# రాహుల్ గాంధీపై మోదీ నిప్పులు

- నాయకత్వంపై ఘాటు వ్యాఖ్యలు
- ప్రపంచం కొత్త వ్యవస్థ వైపు
- భారత్‌లో మాత్రం అరాచకం?



ప్రపంచమంతా కొత్త అంతర్జాతీయ వ్యవస్థ కోసం ఎదురుచూస్తుంటే.. భారత్‌లో కొందరు మాత్రం అస్తవ్యస్త పరిస్థితులను కోరుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. గురువారం జరిగిన ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2026 ప్రారంభ కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో అనిశ్చితి నెలకొన్న సమయంలో భారత్ బలమైన దేశంగా తన ప్రతిష్ఠను చాటుకోవాల్సి ఉందని, అయితే కొందరు విదేశాలకు వెళ్లి దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. విదేశీయులను భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని కోరడం సరికాదని వ్యాఖ్యానించారు.

**ఫెయిలైన ప్రొడక్ట్.. కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలు**

కాంగ్రెస్ తన నాయకుడిని విజయవంతం చేసేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం ఉండటం లేదని మోదీ ఎద్దేవా చేశారు. శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాల కంటే కాంగ్రెస్ తన నాయకుడిని రాజకీయంగా నిలబెట్టేందుకు చేసే ప్రయత్నాలే ఎక్కువగా ఉన్నాయని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఒక కుటుంబ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు దేశ విజయాలు, అభివృద్ధిని పణంగా పెడుతున్నారని ఆరోపించారు. అధికారం కోల్పోయిన తర్వాత కాంగ్రెస్ వైఖరి పుల్లని ద్రాక్షను తలపిస్తోందని, చివరకు ఆ ద్రాక్ష తీగనే నాశనం చేయాలని చూస్తోందని విమర్శించారు.

**ఒక్కరి కోసమే పార్టీనా? మోదీ సూటి ప్రశ్న**

నెహ్రూగాంధీ కుటుంబం కాంగ్రెస్‌కు భారంగా మారిందని మోదీ వ్యాఖ్యానించారు. పార్టీలోని సీనియర్ నేతలు సైతం ఈ విషయాన్ని ప్రైవేటు సంభాషణల్లో అంగీకరిస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో యువ ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వాన్ని విమర్శించేందుకు అవకాశం కోరుతున్నా, ఒక్క నాయకుడికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో సభా కార్యకలాపాలకు కాంగ్రెస్ అడ్డుపడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇతరుల ఎదుగుదలను అడ్డుకునే 'పరాన్నజీవి'గా మారిందని విమర్శించారు. పార్టీ ఆలోచనా శక్తిని 'దిమాగీ నక్సల్స్' ప్రభావితం చేస్తున్నారని, గతంలో గ్రామాల్లో విధ్వంసానికి పాల్పడినవారు ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి దేశాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు.

# చీరాల ఎంజీసీ మార్కెట్‌లో వైఎస్సార్‌సీపీ ప్రచారం



చీరాల ఎంజీసీ మార్కెట్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ ఇస్తర్ల షెర్లీ, ఆర్యవైశ్య కౌన్సిలర్ అభ్యర్థులు ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా మార్కెట్ ఆవరణంలోని శ్రీ ఇష్టసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మార్కెట్ పరిసరాల్లో వ్యాపారులు, ప్రజలను కలుస్తూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంజాబ్‌లో ఎన్డీఏదే అధికారం

- విపక్షాలకు అమిత్ షా సవాల్!
- నిరసనలతో ప్రయోజనం శూన్యం!
- యమునా ప్రక్షాళనకు రూ.8,941 కోట్ల ప్రాజెక్టులు



దేశ రాజధాని ఢిల్లీలో యమునా నదిని ప్రక్షాళన చేసేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 22న శ్యామ్ విహార్‌లో ఢిల్లీ జల్ బోర్డుకు చెందిన 43 ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యమునా నదిని పునరుజ్జీవింపజేసిన తర్వాత 2029లో ప్రజల ముందుకు వెళ్లి బీజేపీ మద్దతు కోరుతామని ప్రకటించారు. గతంలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాలు మురుగునీటిని నదిలోకి వదిలేందుకు అనుమతించాయని ఆరోపించారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం నదిలోకి చేరుతున్న మురుగునీటి ప్రవాహాన్ని తగ్గించిందని పేర్కొన్నారు.

***నిరసనలతో ఏం సాధిస్తారు?***

కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ సహా విపక్షాలపై అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నిరసనలు, ఆందోళనలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. అధికార పక్షంపై ఈవీఎంల ట్యాంపరింగ్, ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్న విపక్షాలు అనేక రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్నాయని విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అనుసరిస్తున్న సాకులు చెప్పే రాజకీయాలు రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీని కాపాడలేవని వ్యాఖ్యానించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, పంజాబ్‌లో ఆప్ ఘోర పరాజయం చవిచూడబోతోందని జోస్యం చెప్పారు.

***పంజాబ్‌లో ఎన్డీఏ సర్కారు..!***

రాబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పంజాబ్‌ను పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణా సమస్యకు ముగింపు పలుకుతామని హామీ ఇచ్చారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యమునా ప్రక్షాళన నుంచి పంజాబ్ రాజకీయాల వరకు విపక్షాలపై విమర్శలు గుప్పించిన అమిత్ షా, రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ విజయంపై తన విశ్వాసాన్ని బహిరంగంగా ప్రకటించారు.

# డ్రాగన్ జోరుకు బ్రేక్!

- చైనా స్టాక్ మార్కెట్ 20 శాతం పతనం
- ఏఐ ఆశలు, ఆర్థిక ఆందోళనలతో కలవరం



చైనా స్టాక్ మార్కెట్‌లో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఏఐ రంగంపై భారీ ఆశలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆర్థిక పునరుజ్జీవన అంచనాలతో గతంలో దూసుకెళ్లిన మార్కెట్లు ఇప్పుడు వెనకడుగు వేస్తున్నాయి. షాంఘై, షెన్‌జెన్ మార్కెట్లలోని 300 ప్రధాన కంపెనీల పనితీరును ప్రతిబింబించే సీఎస్ఐ 300 సూచీ జూన్ గరిష్ఠ స్థాయి నుంచి సుమారు 20 శాతం పడిపోయింది. అక్టోబర్ 22న ఒక్కరోజే ఈ సూచీ 1.6 శాతం వరకు క్షీణించింది. హాంకాంగ్‌లో నమోదైన చైనా కంపెనీల షేర్లు కూడా అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. అక్కడి ప్రధాన షేర్ల సూచీ 2.9 శాతం వరకు పడిపోయింది. గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం పతనాన్ని సాధారణంగా బేర్ మార్కెట్‌గా పరిగణిస్తారు. ఈ పరిణామం చైనా ఆర్థిక వ్యవస్థపై పెట్టుబడిదారుల్లో పెరుగుతున్న ఆందోళనలను ప్రతిబింబిస్తోంది.

***ఏఐపై ఆశలు ఆవిరి.. లాభాలపై సందేహాలు***

చైనా సాంకేతిక రంగం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతుందనే అంచనాలు గతంలో పెట్టుబడులను ఆకర్షించాయి. ఏఐ అభివృద్ధికి బీజింగ్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం కూడా టెక్నాలజీ షేర్ల పెరుగుదలకు దోహదపడింది. అయితే కంపెనీల విలువలు పెరిగినంత వేగంగా వాటి లాభాలు పెరుగుతున్నాయా అనే ప్రశ్న ఇప్పుడు ముందుకొస్తోంది. అంచనాలు అధికంగా ఉండి, వాస్తవ లాభాలు నిరాశపరిస్తే షేర్ల పతనం తప్పదనే పరిస్థితి కనిపిస్తోంది. అంతర్జాతీయంగా ఏఐ సంబంధిత షేర్లలో అమ్మకాలు పెరగడం కూడా ఆసియా మార్కెట్లపై ప్రభావం చూపుతోంది. మరోవైపు చైనా వినియోగదారులు ఖర్చు చేయడంలో వెనుకంజ వేస్తుండటంతో దేశీయ డిమాండ్ బలహీనంగా ఉంది. మూడో త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి అంచనాలను మించినప్పటికీ, ప్రజల కొనుగోళ్లు పెరగడం, కంపెనీల ఆదాయాలు మెరుగుపడటం వంటి సంకేతాల కోసం పెట్టుబడిదారులు ఎదురుచూస్తున్నారు.

**ప్రభుత్వ ఉద్దీపనపై తగ్గి ఆశలు**

చైనా ప్రభుత్వం మార్కెట్లను నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, భారీ కొత్త ఉద్దీపన ప్యాకేజీపై ఆశలు తగ్గడం పెట్టుబడిదారులను నిరాశకు గురిచేస్తోంది. ప్రభుత్వ మద్దతుతో షేర్ల కొనుగోళ్లు తాత్కాలికంగా పతనాన్ని అడ్డుకోవచ్చు కానీ, దీర్ఘకాలిక వృద్ధికి బలమైన కంపెనీ లాభాలు, వినియోగ డిమాండ్ అవసరం. ప్రపంచంలో అతిపెద్ద బ్యాటరీ తయారీ సంస్థగా ఉన్న కాంటెంపరరీ ఆంపెరెక్స్ టెక్నాలజీ (సీఏటీఎల్) త్రైమాసిక లాభాల వృద్ధి అంచనాలను అందుకోలేకపోయింది. దీంతో బుధవారం దాని షేర్లు 12 శాతం పడిపోయాయి. రంగానికి లభిస్తున్న విధానపరమైన మద్దతు తగ్గుతున్న నేపథ్యంలో కంపెనీల వృద్ధిపై సందేహాలు పెరిగాయి. చౌకగా కనిపించే షేర్లు తప్పనిసరిగా మంచి పెట్టుబడులు కావని ఫిల్వారియాఫిన్‌సర్వ్ భాగస్వామి అభిషేక్ ఫిల్వారియా హెచ్చరించారు. ఎన్డీటీవీతో మాట్లాడుతూ, బలహీన వినియోగం, ఉద్దీపనపై అనిశ్చితి, ఏఐ షేర్ల ఒడిదుడుకులు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. పెట్టుబడికి ముందు కంపెనీల ఆదాయ సామర్థ్యం, వ్యాపార పునాదులు పరిశీలించాలని సూచించారు.

***కోలుకోవాలంటే.. వాస్తవ వృద్ధి తప్పనిసరి***

చైనా మార్కెట్ పతనాన్ని కొనుగోళ్లకు అవకాశంగా చూడాలా అనే ప్రశ్న ఇప్పుడు పెట్టుబడిదారులను వేధిస్తోంది. షేర్ల ధరలు తగ్గడం ఒక్కటే పెట్టుబడికి సరైన సమయం వచ్చిందని నిరూపించదని నిపుణులు చెబుతున్నారు. వినియోగదారుల ఖర్చులు పెరగడం, కంపెనీల లాభాలు మెరుగుపడటం, ప్రభుత్వ విధానాలు వ్యాపారాలకు స్పష్టమైన ప్రయోజనాలు అందించడం కీలకమని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ నిర్ణయాలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు మార్కెట్లను వేగంగా ప్రభావితం చేసే పరిస్థితుల్లో పెట్టుబడులను వివిధ రంగాలు, మార్కెట్లలో విస్తరించడం అవసరమని ఫిల్వారియా సూచించారు. చైనా షేర్లకు స్థిరమైన పునరుద్ధరణ రావాలంటే తాత్కాలిక ర్యాలీలు సరిపోవు; ఆర్థిక పరిస్థితులు, కంపెనీల ఆదాయాలు, పెట్టుబడిదారుల విశ్వాసం మెరుగుపడాలి. అప్పుడే ప్రస్తుత పతనం నుంచి మార్కెట్ నిలకడగా కోలుకునే అవకాశం ఉంటుంది.

# ఏపీ సీఎస్ సాయి ప్రసాద్ పదవీకాలం పొడిగింపు



**అమరావతి, అక్టోబర్ 22:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. దీంతో ఆయన 2027 మే 31 వరకు సీఎస్‌గా కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సాయి ప్రసాద్ పదవీకాలం గతంలో డిసెంబర్ 1 నుంచి ముగియాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 29న పొడిగింపు కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. వాటిని పరిశీలించిన కేంద్రం మరోసారి ఆరు నెలల గడువు మంజూరు చేసింది. గతంలోనూ జూన్ 1 నుంచి నవంబర్ 30 వరకు ఆయన పదవీకాలాన్ని పొడిగించిన విషయం తెలిసిందే. తాజా నిర్ణయంతో రాష్ట్ర పరిపాలనలో ఆయన కొనసాగింపు ఖరారైంది.

# చిలకలూరిపేటలో దాడులు..

- ఎస్ఈసీకి రజిని ఫిర్యాదు



చిలకలూరిపేట, అక్టోబర్ 22: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై దాడులు చేసి, బెదిరింపులతో నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేశారని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. చిలకలూరిపేటలో టీడీపీ శ్రేణుల దౌర్జన్యాలపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆధారాలు, వీడియోలు సమర్పించినట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ముగియాల్సిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగడంపై ప్రశ్నించారు. నాదెండ్లలో అభ్యర్థులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారని, ఎడ్లపాడులో నామినేషన్లకు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. సీసీటీవీ ఫుటేజీని భద్రపరిచి, ఘటనలపై విచారణ జరిపి ఎన్నికలను తిరిగి నిర్వహించాలని కోరినట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం చర్యలు తీసుకోకపోతే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని రజిని స్పష్టం చేశారు.

# లక్షకు పైగా జీవోలు గల్లంతు!

**58.5 శాతం ఉత్తర్వులు ఎక్కడ? ప్రజలకు తెలియని ప్రభుత్వ నిర్ణయాలు! ప్రభుత్వ నిర్ణయాలు గోప్యంగా ఎందుకు? పారదర్శకతపై హైకోర్టులో న్యాయపోరాటం**

*తెలంగాణలో ప్రభుత్వ నిర్ణయాల వెనుక ఏం జరుగుతోంది? ప్రజల కోసం తీసుకున్న నిర్ణయాలే ప్రజలకు తెలియకుండా ఉంటే.. పాలనలో పారదర్శకత ఎక్కడున్నట్లు? రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి జారీ చేసిన 1,99,115 ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఏకంగా 1,16,458 జీవోలు ప్రజల పరిశీలనకు అందుబాటులో లేవన్న గణాంకాలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. అంటే దాదాపు 58.5 శాతం ప్రభుత్వ ఉత్తర్వులు పబ్లిక్ డొమైన్‌లో లేవు! బీఆర్ఎస్ పదేళ్ల పాలన నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలన వరకు కొనసాగుతున్న ఈ పరిస్థితిపై బి. వినయ్ రెడ్డి హైకోర్టు తలుపు తట్టారు. ఇటీవలి కాలంలో జారీ చేసిన జీవోల్లో 82.7 శాతం ప్రజలకు అందుబాటులో లేవన్న ఆరోపణలు వ్యవహారాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయి. భూముల కేటాయింపులు, కాంట్రాక్టులు, ఆర్థిక రాయితీలు, కీలక విధాన నిర్ణయాలకు సంబంధించిన ఉత్తర్వులు ప్రజల కంటికి కనిపించకపోతే వాటిపై పర్యవేక్షణ ఎలా సాధ్యం? గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా జీవోల ప్రచురణపై వివాదాలు ఎందుకు కొనసాగుతున్నాయి? సమాచార హక్కు దరఖాస్తుకు సమాధానం రావడానికి 207 రోజులు ఎందుకు పట్టింది? ఇవి ఇప్పుడు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు. జీవోలు అందుబాటులో లేవన్న కారణంతోనే అక్రమాలు జరిగినట్లు నిర్ధారించలేం. కానీ వాటి వెనుక కారణాలేమిటో వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ రికార్డులు ప్రజలకే దూరమైతే.. పారదర్శక పాలనకు అర్థమేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం కోసం ఇప్పుడు అందరి చూపు హైకోర్టు వైపు మళ్లింది.*




తెలంగాణలో ప్రభుత్వ పాలన పారదర్శకతపై ఈ గణాంకాలు తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో సగానికి పైగా ప్రజల పరిశీలనకు అందుబాటులో లేకపోవడంపై న్యాయపోరాటం మొదలైంది. 2014 జూన్ 2 నుంచి 2025 మార్చి 14 వరకు మొత్తం 1,99,115 ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) జారీ కాగా, వాటిలో కేవలం 82,657 మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం శాసనసభకు అందించిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన 1,16,458 జీవోలు, అంటే సుమారు 58.5 శాతం ఉత్తర్వులు పబ్లిక్ డొమైన్‌లో లేవు. ఈ వ్యవహారంపై బి. వినయ్ రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. W.P. No. 35494 of 2026 ద్వారా చట్టబద్ధంగా మినహాయించదగిన సమాచారాన్ని మినహాయించి, మిగిలిన అన్ని జీవోలను ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ పిటిషన్‌ను న్యాయవాది మహేష్ మామిండ్ల దాఖలు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది. రెండు ప్రభుత్వాలూ పారదర్శక పాలన, జవాబుదారీతనంపై ప్రకటనలు చేసినప్పటికీ, జీవోల ప్రచురణ గణాంకాలు ఆ హామీల అమలుపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతులు, భూముల కేటాయింపులు, కాంట్రాక్టులు, ఆర్థిక రాయితీలు, నియామకాలు, విధాన నిర్ణయాలకు సంబంధించిన ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో లేకపోతే వాటిని పరిశీలించడం పౌరులకు, పాత్రికేయులకు, సమాచార హక్కు కార్యకర్తలకు కష్టమవుతుంది. ముఖ్యంగా ప్రజాధనంతో ముడిపడిన నిర్ణయాలపై పర్యవేక్షణ బలహీనపడే ప్రమాదం ఉంది. అయితే జీవోలు అందుబాటులో లేకపోవడమే అక్రమాలకు ఆధారం కాదు. వాటిని ప్రచురించకపోవడానికి గల కారణాలు, చట్టపరమైన మినహాయింపులు, సంబంధిత శాఖల వివరణలు పరిశీలించిన తర్వాతే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

**ఆర్టీఐ గణాంకాలు.. కోర్టు ఆదేశాలు**

ఇటీవలి కాలంలో జీవోల ప్రచురణ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. 2025 నవంబర్ 18న అందిన సమాచార హక్కు చట్టం సమాధానాన్ని ఉటంకిస్తూ, 2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 26 వరకు జారీ చేసిన 19,064 జీవోల్లో కేవలం 3,290 మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అంటే ఆ కాలంలో సుమారు 82.7 శాతం జీవోలు పబ్లిక్ డొమైన్‌లో లేవు. హోంశాఖకు సంబంధించిన జీవోలు 100 శాతం ప్రజల వీక్షణకు అందుబాటులో లేవని కూడా పిటిషనర్ ఆరోపించారు. జీవోలను 'Public', 'Internal' అనే వర్గాలుగా విభజించే విధానంలో సమాచార హక్కు చట్టంలోని సెక్షన్లు 8, 9 కింద వర్తించే మినహాయింపులకు సంబంధించిన కారణాలను స్పష్టంగా నమోదు చేయడం లేదన్నది ఆయన ప్రధాన అభ్యంతరం. జీవోల ప్రచురణపై గతంలోనూ న్యాయపరమైన వివాదాలు కొనసాగాయి. 2016 ఫిబ్రవరిలో ప్రభుత్వ జీవోల వెబ్‌సైట్ నిలిచిపోవడంపై దాసోజు శ్రవణ్ కుమార్ హైకోర్టును ఆశ్రయించినట్లు ఈ వ్యవహారానికి సంబంధించిన నేపథ్య సమాచారం పేర్కొంటోంది. 2017 ఏప్రిల్ 10న జారీ చేసిన G.O.Ms.No.4లో ప్రభుత్వ వెబ్‌సైట్ మార్గదర్శకాల అమలు, శాఖల్లో వెబ్ ఇన్ఫర్మేషన్ మేనేజర్ల నియామకం వంటి అంశాలు ఉన్నాయి. 2022 మార్చి 10న W.P. (PIL) No. 121 of 2019లో పెండింగ్ జీవోలను ఎనిమిది వారాల్లో అప్‌లోడ్ చేయాలని హైకోర్టు ఆదేశించినట్లు పిటిషనర్ ప్రస్తావించారు. 2025 డిసెంబర్ 23న W.P. No. 39547 of 2025లో మరోసారి ఇలాంటి ఆదేశాలు వెలువడ్డాయని, వాటి అమలుకు ఇచ్చిన గడువు 2026 ఫిబ్రవరి 17తో ముగిసిందని తెలిపారు. 2026 జూలై 24న C.C. No. 3402 of 2026 ధిక్కరణ కేసులో అడ్మిషన్‌కు ముందు నోటీసులు జారీ అయినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నది పిటిషనర్ వాదన. అయితే ప్రస్తుత అమలు పరిస్థితి, ప్రభుత్వ సమాధానం, న్యాయస్థానాల తదుపరి నిర్ణయాలు పరిశీలించాల్సి ఉంది. కోర్టు ఆదేశాల ఉల్లంఘన జరిగిందా లేదా అనేది న్యాయపరమైన పరిశీలనతోనే నిర్ధారణ కావాలి.

**207 రోజుల నిరీక్షణ.. హైకోర్టులో కీలక డిమాండ్లు**

ప్రభుత్వ జీవోల వివరాలు కోరుతూ బి. వినయ్ రెడ్డి 2026 జనవరి 17న ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ప్రజా సమాచార అధికారికి ఆర్టీఐ దరఖాస్తు సమర్పించారు. 2014 నుంచి ఏటా, శాఖలవారీగా జారీ చేసిన జీవోల సంఖ్య, వెబ్‌సైట్‌లో ప్రచురించిన ఉత్తర్వులు, ప్రచురించని జీవోలకు కారణాలు, సంబంధిత నిబంధనల వివరాలు కోరారు. ప్రెస్ నోట్ ప్రకారం, ఫిబ్రవరి 16న దరఖాస్తు 'Deemed Refusal'గా నమోదైంది. ఫిబ్రవరి 22న దాఖలు చేసిన మొదటి అప్పీల్ కూడా మార్చి 24న అదే విధంగా నమోదైంది. చివరకు ఆగస్టు 12న, దరఖాస్తు చేసిన 207 రోజుల తర్వాత, ఈ సమాచారం తమ పరిధిలోకి రాదని పీఐఓ సమాధానం ఇచ్చినట్లు పిటిషనర్ తెలిపారు. అక్టోబర్ 7న ఫైలు ఇంకా పరిశీలనలో ఉందని పేర్కొంటూ సమాచార కమిషన్‌ను మరింత సమయం కోరినట్లు వెల్లడించారు. సమాచార కమిషన్‌లోనూ జాప్యం జరిగిందని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 22న దాఖలైన ఫిర్యాదు జూలై 15న 4633/SIC AR/2026 నంబరుతో నమోదైందని, ఆగస్టు 13, సెప్టెంబర్ 8, అక్టోబర్ 13 తేదీల్లో విచారణ జరిగినా నిర్ణయం వెలువడలేదని ఆరోపించారు. వీడియో కాన్ఫరెన్స్ విచారణకు అవకాశం కల్పించకపోవడం, రోజువారీ ఆర్డర్ షీట్లు అందించకపోవడం వంటి అంశాలనూ ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై కమిషన్ వివరణ తెలియాల్సి ఉంది. హైకోర్టులో పిటిషనర్ కోరిన ప్రధాన ఉపశమనాల్లో భాగంగా, 2014 జూన్ 2 నుంచి జారీ చేసిన జీవోలను చట్టబద్ధమైన మినహాయింపులకు లోబడి ప్రచురించాలని, శాఖలవారీగా ప్రచురించని ఉత్తర్వుల సంఖ్యతో పాటు కారణాలను వెల్లడించాలని కోరారు. అవసరమైన సమాచారాన్ని రెండు వారాల్లో ఉచితంగా అందించాలని, ప్రతి శాఖలో వెబ్ ఇన్ఫర్మేషన్ మేనేజర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. సమాచార కమిషన్‌లో సకాల విచారణలు, వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం, కేసుల త్వరిత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇవన్నీ పిటిషనర్ అభ్యర్థనలు మాత్రమే; హైకోర్టు తుది తీర్పుగా భావించరాదు. జీవోలు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగిందా, అధికారుల నిర్లక్ష్యం ఉందా, ఉద్దేశపూర్వకంగా ఉత్తర్వులను దాచారా అనే అంశాలు స్వతంత్ర ఆధారాలతోనే నిర్ధారించాలి. ప్రభుత్వం స్పష్టమైన గణాంకాలు, ప్రచురణకు సంబంధించిన కారణాలు, బాధ్యత వహించే అధికారుల వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు సంబంధించిన నిర్ణయాలను ప్రజలు పరిశీలించే అవకాశం కల్పించడం ప్రజాస్వామ్య పాలనలో కీలకం. పారదర్శకత అనేది ప్రకటనలకే పరిమితం కాకూడదు. చట్టం మినహాయించిన సమాచారాన్ని మినహాయించి, మిగిలిన ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. అప్పుడే జవాబుదారీతనం బలోపేతమవుతుంది.



*– గంజి శ్రీనివాసరావు*

# వైఎస్సార్‌సీపీలోకి గుండ లక్ష్మీదేవి



శ్రీకాకుళం, అక్టోబర్ 22: ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి దాదాపు నాలుగు దశాబ్దాల టీడీపీ అనుబంధానికి ముగింపు పలికి వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె ముఖ్య అనుచరులతో కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. 2014లో టీడీపీ తరఫున శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మీదేవి, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ కుటుంబానికి చెందినవారు. ఆమెతో పాటు పలువురు టీడీపీ నాయకులు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుండ లక్ష్మీదేవి పార్టీ మార్పు శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# వైసీపీలోకి పాఠంశెట్టి సూర్యచంద్ర కుటుంబం



కాకినాడ, అక్టోబర్ 22: జగ్గంపేట రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పాఠంశెట్టి సూర్యచంద్ర తన సతీమణి శ్రీదేవి, ముఖ్య అనుచరులతో కలిసి వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. జగన్ పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. బూరుగుపూడి గ్రామ సర్పంచ్‌గా మూడుసార్లు పనిచేసిన సూర్యచంద్రకు జగ్గంపేట నియోజకవర్గంలో గుర్తింపు ఉంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, 2024లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. తాజా చేరికతో జగ్గంపేటలో వైఎస్సార్‌సీపీ రాజకీయ కార్యకలాపాలకు కొత్త ప్రాధాన్యం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ తోట నరసింహంతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల అక్రమాలపై వైసీపీ ఆందోళన



విజయవాడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకుంటూ దాడులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా పరిస్థితుల్లో మార్పు లేదంటూ విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠాను కలిసి వినతిపత్రం అందజేశారు. నామినేషన్లు వేస్తే గంజాయి కేసులు పెడతామని, రౌడీషీట్లు తెరుస్తామని పోలీసులు బెదిరిస్తున్నారని లేళ్ల అప్పిరెడ్డి ఆరోపించారు. మహిళా అభ్యర్థులకు రక్షణ కల్పించాలని కల్పలతారెడ్డి కోరారు. అక్రమ ఏకగ్రీవాలను అడ్డుకోవాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట మున్సిపల్ ఎన్నికలను రద్దు చేసి, మళ్లీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించాలని తన్నీరు నాగేశ్వరరావు కోరారు. నిష్పక్షపాత ఎన్నికల కోసం న్యాయపోరాటం కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు.

# పంజాబ్‌లో ఉద్యోగుల సమ్మె సెగ

**3 లక్షల మందికి పైగా ఉద్యోగుల నిరసన**



రోడ్డు రవాణా సమ్మెతో ప్రయాణికులకు ఇబ్బందులుపంజాబ్‌లో భగవంత్ మాన్ ప్రభుత్వానికి ఉద్యోగుల నిరసనలు సవాల్‌గా మారాయి. 3 లక్షల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు సామూహిక సాధారణ సెలవు తీసుకోగా, పంజాబ్ రోడ్‌వేస్, పన్‌బస్, పీఆర్‌టీసీ కాంట్రాక్టు కార్మికులు సమ్మెను నిరవధికంగా కొనసాగించాలని నిర్ణయించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పనులు మందగించాయి. ఉద్యోగ సంఘాల ఆందోళనలతో ప్రజా రవాణా, ప్రభుత్వ సేవలపై ప్రభావం పడుతోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ పరిణామాలు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. గురువారం సాయంత్రం 4 గంటలకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఏపీ సిన్హాతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో గతంలో జరిగిన చర్చల వివరాలను ప్రభుత్వం విడుదల చేయాలన్న సంఘాల డిమాండ్ నెరవేరిన తర్వాత ఈ భేటీ జరిగింది. దాదాపు రెండు గంటలపాటు చర్చలు సాగినా స్పష్టమైన పరిష్కారం లభించలేదు.



# వెంకట రమణకే మళ్లీ దేవాంగ సంఘం పగ్గాలు!

## మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నిక
## కూటమికి మద్దతుతోనే సంఘం బలోపేతం



అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బల్ల వెంకటరమణ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధి, దేవాంగ సామాజిక వర్గ సంక్షేమమే లక్ష్యంగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని ఆయన ప్రకటించారు. మంగళగిరి నగర పరిధిలోని ఇప్పటం రోడ్డులో పోట్లాబత్తుని లక్ష్మణరావు మామిడి తోటలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అల్లక తాతారావు, కోశాధికారిగా అల్లక నమశ్శివాయ ఎన్నికయ్యారు. గత కార్యవర్గాన్నే కొనసాగించాలని సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించడం సంఘంపై ప్రస్తుత నాయకత్వానికి ఉన్న విశ్వాసాన్ని చాటింది. తనను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.

**సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు ప్రణాళిక**

దేవాంగ సామాజిక వర్గ అభ్యున్నతికి గతంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని వెంకటరమణ తెలిపారు. సభ్యుల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సమావేశంలో సంఘం ఆదాయ వ్యయాల వివరాలను కార్యవర్గ సభ్యులకు వివరించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి, సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. సామాజిక వర్గ అభివృద్ధికి సభ్యులందరూ ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**మంగళగిరి–తాడేపల్లి ఎన్నికల్లో కూటమికి అండ**

రాబోయే మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల్లో అధికార కూటమికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. తమ తమ వార్డుల్లో కూటమి అభ్యర్థులకు సహకరించాలని సభ్యులు నిర్ణయించారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారులు పుచ్చల వెంకటేశ్వరరావు, ఆచార్య రత్న, డాక్టర్ కొసనం కోట నాగ శ్యామలరావు, మెట్ల జగపతి, అధికార ప్రతినిధి బీరక మల్లేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు యుద్ధం అప్పారావు, కనకం రాజారావుతోపాటు సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమావేశాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సంఘం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాచమల్లు తీరుపై కొండారెడ్డి ఆగ్రహం



ప్రొద్దుటూరు: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి తీవ్రంగా స్పందించారు. రాచమల్లు భాషపై సంయమనం పాటించాలని, లేకుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రొద్దుటూరులో ప్రశాంత వాతావరణం కొనసాగాలని తాము కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతు లేదనే అసహనంతోనే రాచమల్లు అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో నామినేషన్లను అడ్డుకున్న ఘటనలను గుర్తుచేస్తూ, ఇప్పుడు ప్రజాస్వామ్యంపై మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. తన భార్య రమాదేవితో నామినేషన్ ఎందుకు ఉపసంహరింపజేశారని నిలదీశారు. 2029లో వైసీపీ అధికారంలోకి వస్తే మున్సిపల్ చైర్మన్ అభ్యర్థితో రాజీనామా చేయిస్తానన్న వ్యాఖ్యలపైనా సవాల్ విసిరారు. ఎన్నికల వేళ ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది.



# స్థానిక ఎన్నికలపై వైసీపీ కుట్రలు: పట్టాభి

అమరావతి, అక్టోబర్ 22: స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ దాడులు, హింసకు పాల్పడుతోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ, ఎన్నికలు సకాలంలో జరగకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన రూ.12,500 కోట్ల నిధులకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యక్తులను రప్పించి పుంగనూరు, కడప, రాయచోటి ప్రాంతాల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీగా నామినేషన్లు దాఖలవుతున్నాయని గణాంకాలు వెల్లడిస్తూ, వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను వక్రీకరించవద్దని సూచించారు. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని గౌరవిస్తామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# తంబళ్లపల్లె దాడిపై నాదెండ్ల ఆగ్రహం



అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో జనసేన కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసి, కార్యాలయాన్ని ధ్వంసం చేయడంతోపాటు వాహనాలను పాడుచేసి, అడ్డువచ్చిన వారిపై దాడులకు దిగడం దారుణమని మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలిచే నమ్మకం లేకే వైసీపీ అరాచకాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, రాజకీయ హింసను ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రత్యర్థి పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడం ద్వారా రాజకీయంగా పైచేయి సాధించలేరని స్పష్టం చేశారు.




# ప్రొద్దుటూరులో ఎంపీటీసీ నామినేషన్లు

ప్రొద్దుటూరు, అక్టోబర్ 22: ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు ప్రశాంతంగా కొనసాగింది. ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ప్రొద్దుటూరు మండలంలో మొత్తం 24 ఎంపీటీసీ స్థానాలకు గాను 12 స్థానాల్లో కూటమి నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. మరోవైపు, నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఇప్పటివరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేదు. రాజుపాలెం మండలంలోని తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు 21 నామినేషన్లు నమోదయ్యాయి. రెండు మండలాల్లో కలిపి మొత్తం 33 నామినేషన్లు దాఖలయ్యాయి.

# అల్లా సాక్షిగా అన్యాయం..!

## ఒక్క సీటుతో సరిపెడతారా?
## విశాఖలో ముస్లింల ఆవేదన
## కూటమికి మైనార్టీల టెన్షన్



అల్లా సాక్షిగా తమకు అన్యాయం జరిగిందని ముస్లింలు వాపోతున్నారు. జనాభాలో దాదాపు నాలుగు శాతం ఉన్న తమకు నగరపాలక సంస్థ ఎన్నికల్లో మొండి చేయి చూపిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. కేవలం ఒకే ఒక్క సీటుతో సరిపెట్టడంతో అయోమయానికి గురయ్యారు. చివరి వరకు టెన్షన్ పెట్టి.. 120 వార్డుల్లో కేవలం ఒకే ఒక్క స్థానం కేటాయించడంతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. చివరి నిమిషంలో మహ్మద్ రఫీకి 90వ వార్డు కేటాయించి మమ అన్పించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విశాఖలో 3.85 శాతం ముస్లిం జనాభా**

దశాబ్దాల తరబడి తెలుగుదేశం పార్టీకి కొమ్ముకాసిన ముస్లింలకు ప్రాధాన్యత లేదని వాపోతున్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో వార్డుల కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందని అంటున్నారు. అధిష్ఠానం చెప్పినా స్థానిక నేతలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్‌లు జోక్యం చేసుకొని ముస్లింలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. విశాఖ నగరంలో 3.85 శాతం ముస్లిం జనాభా ఉంది. వారిలో 65% సున్ని జమాత్, షియా జమాత్ 5%, ఆహేలే హదీస్ జమాత్ 15%, తబ్లికి జమాత్ 15% ఉన్నారు. దాదాపు మూడు లక్షలకు పైబడి ముస్లిం ఓటర్లు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి.

**విస్తరించిన విశాఖ ముస్లింలు**

విశాఖ నగరంతో పాటు విశాఖలో ముస్లింల సంఖ్య కూడా విస్తరించింది. ఒకప్పుడు ఓల్డ్ టౌన్‌కు పరిమితమైన ముస్లింలు గాజువాక, తూర్పు నియోజకవర్గం, ఇతర ప్రాంతాల్లో జనాభాపరంగా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలలో వీరి పాత్ర తక్కువేమీ కాదు. అన్న ఎన్టీఆర్ హయాంలో ఒకటో నియోజకవర్గం నుంచి డాక్టర్ ఎస్.ఏ. రెహమాన్ శాసనసభ్యుడిగా గెలిచారు. అనంతరం విశాఖ నగరాభివృద్ధి సంస్థ హుడా చైర్మన్‌గా కూడా పనిచేశారు. రెహమాన్ హయాంలో ముస్లింలకు విశాఖలో పెద్దపీట వేశారని చెప్పవచ్చు. విశాఖలో టీడీపీకి పెద్ద దిక్కుగా పేరుపొందిన ఎం.వి.వి.ఎస్. మూర్తి ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చారు.

**పట్టించుకోని టీడీపీ.. నిరాశలో ఆశావహులు**

జీవీఎంసీ ఎన్నికల్లో ముస్లింలకు నిరాశ ఎదురవుతోంది. తెలుగుదేశం పార్టీకి దశాబ్దాలుగా సేవలందిస్తున్న కార్యకర్తలు కార్పొరేషన్ ఎన్నికల కోసం వేయికళ్లతో ఎదురుచూశారు. తమ నేతలు హామీ ఇచ్చారని వార్డుల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. చివరి నిమిషంలో కూటమి పొత్తులు కొలిక్కి రాలేదు. ఆశావహులు తమ నేతలను నమ్మి నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత కూడా అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గం నుంచి ఒకరు, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల నుంచి ఇద్దరు కార్పొరేటర్ సీట్లు ఆశిస్తున్నారు. స్థానికంగా పలుకుబడి, ఆర్థిక స్థిరత్వం ఉన్న వీరికి టికెట్లు కేటాయించాలని అభ్యర్థించారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా పొత్తుల చర్చలు ఫైనల్ కాకపోవడంతో వీరి పరిస్థితి డోలాయమానంగా మారింది.

**వైఎస్సార్‌సీపీ పెద్దపీట**

వివిధ వర్గాల పెద్దలతో పాటు నగరంలో అందరికీ ప్రాతినిధ్యం వహించే ఆల్ మసీద్ కమిటీ పెద్దలు సైతం తెలుగుదేశం పార్టీ నేతలను కలిశారు. తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికలను ఎదుర్కోవడానికి తగిన అంగబలం, అర్థబలం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పినట్లు ముస్లిం పెద్దలు ఆరోపిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్ పార్టీ విశాఖ నగరంలో నలుగురు ముస్లింలకు స్థానాలు కేటాయించింది. ముస్లిం వర్గాలకు పెద్దపీట వేస్తున్నామని ప్రచారం చేసుకుంటోంది.

**ముస్లింల అసంతృప్తి టీడీపీకి ఇబ్బందేనా?**

తెలుగుదేశం పార్టీ ముస్లింలకు న్యాయం చేయకపోతే కార్పొరేషన్ ఎన్నికల్లో వారిలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉంది. మేయర్‌తో పాటు కార్పొరేటర్ స్థానాలకు కూడా ముస్లింల వ్యతిరేకత ఇబ్బంది కలిగించే అంశంగా భావించవచ్చు. తెలుగుదేశం పార్టీ అధిష్ఠాన వర్గం, స్థానిక నేతలు సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారని, తమకు న్యాయం చేస్తారని ముస్లిం పెద్దలు భావిస్తున్నారు. భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీకి తమ మద్దతు ఉండాలంటే దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

**- కేసానపల్లి కోటేశ్వరరావు, ఇన్‌పుట్ ఎడిటర్, నాదేశం**

### ఫలించని ముస్లిం పెద్దల ప్రయత్నాలు

విశాఖ తెలుగుదేశం పార్టీలో ఎన్నికల పరిశీలకుడిగా ఎం.ఏ. షరీఫ్ ఉన్నారు. ఎన్నికల కమిటీలో ఉన్నప్పటికీ ఫలితం లేకపోయిందని ముస్లింలు వాపోతున్నారు. విశాఖ నగరంలో సున్నీ జమాత్‌కు 65 శాతం, షియా జమాత్‌కు ఐదు శాతం జనాభా ఉందని పేర్కొంటున్నారు. అహ్లే హదీస్ జమాత్, తబ్లిగీ జమాత్ వర్గాల నుంచి దాదాపు రెండు శాతం ఓటర్లు ఉన్నారు. 80 మసీదీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సీరత్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌కు కూడా కార్పొరేటర్ సీటు లభించలేదు. పార్టీనే నమ్ముకున్నవారికి మొండి చేయి చూపడం విశేషం. గతంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో దక్షిణ నియోజకవర్గంలో సమర్థవంతంగా వ్యవహరించి, లక్షల రూపాయలు ఖర్చు చేసినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు.



# టిబెట్‌ను వణికించిన భారీ భూకంపం

**16 మంది మృతి.. ఏడు తీవ్రతతో ప్రకంపనలు**

చైనాలోని టిబెట్ ప్రాంతాన్ని గురువారం (అక్టోబర్ 22) అర్ధరాత్రి భారీ భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 7.0 తీవ్రతతో సంభవించిన ప్రకంపనలకు 16 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 32 మంది గాయపడ్డారు. స్థానిక అధికారులను ఉటంకిస్తూ చైనా ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా ఈ వివరాలను వెల్లడించింది. భూకంపం ధాటికి పలు ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి.

**339 ఇళ్లు నేలమట్టం**

నాగ్చు నగర మీడియా కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం, భూకంపం కారణంగా కనీసం 339 ఇళ్లు కూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన 32 మందిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉండగా, మరో 21 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం రెండో స్థాయి భూకంప విపత్తు అత్యవసర స్పందనను అమల్లోకి తెచ్చింది.

**పర్వత ప్రాంతంలో భూకంప కేంద్రం**

అమెరికా భూగర్భ సర్వే సంస్థ వివరాల ప్రకారం, గురువారం రాత్రి 10.33 గంటలకు భూకంపం సంభవించింది. నాగ్చు నగరానికి ఈశాన్య దిశలో సుమారు 190 కిలోమీటర్ల దూరంలో, టిబెట్ రాజధాని లాసాకు ఈశాన్యంగా 390 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం గుర్తించారు. భూమికి కేవలం 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు ఏర్పడటంతో ప్రభావం తీవ్రంగా కనిపించింది.



రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవాల్సిన అధికార పార్టీ నాయకులే సొంత పార్టీ నేతలపై దాడులకు దిగితే పరిస్థితి ఎలా ఉంటుంది? ప్రజలకు భరోసా కల్పించాల్సిన నాయకులే రహదారిపై భయానక వాతావరణం సృష్టిస్తే ప్రజాస్వామ్యానికి ఎదురయ్యే సవాళ్లు ఏమిటి? రాజంపేట నియోజకవర్గంలోని నందలూరులో చోటుచేసుకున్న ఘర్షణ ఈ ప్రశ్నలను మరోసారి ముందుకు తెచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియతో మొదలైన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసినట్లు వచ్చిన కథనాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. రాళ్లు, కర్రలు, బీరుసీసాలతో పరస్పర దాడులు జరిగినట్లు ఆరోపణలు రావడం, వాహనాలకు నిప్పంటించడం, చివరకు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిగినట్లు సమాచారం వెలువడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. కడప–తిరుపతి జాతీయ రహదారిపై దాదాపు గంటసేపు ఉద్రిక్తత కొనసాగినట్లు వివరాలు వెల్లడయ్యాయి. రెండు కార్లు, ఒక బైక్ దగ్ధమైనట్లు, పలువురు గాయపడినట్లు సమాచారం. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, తిరుపతిలో ఎలైట్ ఆసుపత్రుల అధినేత డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం వర్గం, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి వర్గానికి చెందిన నాయకులు ఈ ఘర్షణలో గాయపడినట్లు బాధితుల వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఘర్షణకు ఎవరు శ్రీకారం చుట్టారు? దాడులు ఏ పరిస్థితుల్లో జరిగాయి? కాల్పులకు దారితీసిన పరిణామాలేమిటి? పోలీసులు ఏ చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు అధికారిక దర్యాప్తులోనే స్పష్టత రావాల్సి ఉంది. సొంత పార్టీ నాయకుల మధ్య పదవుల కోసం మొదలైనట్లు చెబుతున్న పోరు.. ప్రజలు ప్రయాణించే జాతీయ రహదారిని ఘర్షణ స్థలంగా మార్చడం ఈ ఘటనలో ప్రధానాంశం.



# రాజంపేట రణరంగం

- రాళ్లు, కర్రలు, బీరుసీసాలతో బీభత్సం..
- గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు..
- డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, మేడా విజయశేఖర్ రెడ్డికి గాయాలు
- జాతీయ రహదారిపై కార్లు, బైక్ దహనం!

## టీడీపీ వర్సెస్ టీడీపీ!

## అధికారం మనదే.. ఆధిపత్యం ఎవరిది?







**• ఎంపీపీ పీఠంపై పోటీ.. రెండు వర్గాల మధ్య విభేదాలు**

నందలూరులో జరిగిన ఘర్షణకు ఎంపీపీ పదవి చుట్టూ నెలకొన్న పోటీ ప్రధాన కారణమని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. మండల పరిషత్ అధ్యక్ష పదవిని ఎవరు చేపట్టాలి? ఎంపీటీసీ అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దించాలి? స్థానిక రాజకీయాల్లో ఎవరి మాటకు ప్రాధాన్యం ఉండాలి? అనే అంశాలే వివాదానికి కేంద్రంగా మారినట్లు తెలుస్తోంది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం తన తల్లి లక్ష్మీనరసమ్మను నందలూరు ఎంపీపీగా చేయాలనే ఉద్దేశంతో ఆమెకు ఎంపీటీసీ నామినేషన్ వేయించేందుకు తన స్వగ్రామమైన లేబాకకు వచ్చారు. ఈ వ్యవహారంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డితో ఆయన చర్చలు జరిపినట్లు సమాచారం. ఇద్దరూ కలిసి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే క్రమంలో ప్రత్యర్థి వర్గంతో వివాదం మొదలైందన్నది బాధితుల వాదన. మరోవైపు, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజుకు చెందిన వర్గంతో సంబంధాలున్న ఎద్దల సుబ్బరాయుడు కుటుంబం తమ కోడలిని ఎంపీపీగా చేయాలనే ప్రయత్నంలో ఉందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు చెబుతున్నాయి. ఈ పోటీలో ఎద్దల సుబ్బరాయుడు కుమారుడు ఎద్దల విజయసాగర్ వర్గీయులు పాల్గొనడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఇవి సంబంధిత వర్గాలు చేస్తున్న ఆరోపణలు మాత్రమే. ఘర్షణకు అసలు కారణాలు, ఎవరి పాత్ర ఎంతవరకు ఉందన్నది విచారణలో నిర్ధారణ కావాలి. మండల పరిషత్ అధ్యక్ష పదవి గ్రామీణ రాజకీయాల్లో కీలకమైనది. ఎంపీటీసీలపై పట్టు, మండల స్థాయి నాయకత్వం, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం, భవిష్యత్తు ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలతో ఆ పదవికి సంబంధం ఉంటుంది. అందుకే స్థానిక పదవుల కోసం పోటీ తీవ్రంగా మారుతుంటుంది. కానీ అభ్యర్థుల ఎంపికపై ఏర్పడిన విభేదాలు భౌతిక దాడులకు దారితీస్తే, అది సాధారణ రాజకీయ పోటీ పరిధిని దాటుతుంది. పదవిని ఎవరు చేపట్టాలనే నిర్ణయం పార్టీ చర్చలు, ఎన్నికల ప్రక్రియ ద్వారా తేలాలి. బలప్రదర్శనతో సమస్యను పరిష్కరించాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం.

**• నాలుగు దశాబాల అనుబంధం.. సొంత పార్టీ నేతలతోనే వివాదం**

డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం పేరు ఈ ఘటనలో ప్రస్తావనకు రావడంతో టీడీపీలోని అంతర్గత రాజకీయాలపై చర్చ మొదలైంది. తిరుపతిలో ఎలైట్ ఆసుపత్రుల అధినేతగా గుర్తింపు పొందిన ఆయన కుటుంబానికి నాలుగు దశాబ్దాలకు పైగా టీడీపీతో రాజకీయ అనుబంధం ఉందని ఆయన వర్గం చెబుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో సంబంధాలు, నారా లోకేశ్ యువగళం కార్యక్రమానికి సంబంధించిన బృందంతో అనుబంధం, ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించడం ఆయన రాజకీయ నేపథ్యంలోని ముఖ్యమైన అంశాలుగా ప్రస్తావిస్తున్నారు. తిరుపతి ప్రాంతంలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయనకు రాజంపేట ప్రాంతంతోనూ సంబంధాలు ఉన్నట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. అలాంటి నాయకుడు తన స్వగ్రామానికి వచ్చి స్థానిక ఎన్నికల వ్యవహారంలో పాల్గొన్న సమయంలో ఘర్షణ చోటుచేసుకోవడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీసింది. అయితే, పార్టీకి దీర్ఘకాలంగా సేవ చేశామనే భావన ఒక వర్గంలో ఉండవచ్చు. స్థానికంగా తమకు బలమైన రాజకీయ పట్టు ఉందని మరో వర్గం భావించవచ్చు. అధిష్ఠానం వద్ద తమకే ప్రాధాన్యం ఉందని ఇరువర్గాలు అనుకోవచ్చు. కానీ ఇలాంటి విభేదాలకు పరిష్కారం పార్టీ అంతర్గత చర్చలు, నాయకత్వ నిర్ణయాలు, చట్టబద్ధమైన ఎన్నికల ప్రక్రియ ద్వారానే రావాలి. సీనియారిటీ, స్థానిక బలం, నాయకులతో పరిచయాలు వంటి అంశాలు రాజకీయ చర్చల్లో ప్రాధాన్యం పొందవచ్చు. అయినప్పటికీ అవి హింసకు కారణం కాకూడదు. ఇదే సమయంలో, ఘర్షణలో బాలసుబ్రహ్మణ్యం తన లైసెన్సు కలిగిన తుపాకీతో గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం వెలువడింది. దాడి నుంచి ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినట్లు ఆయన వర్గం వాదిస్తోంది. అయితే, కాల్పులకు ముందు ఏం జరిగింది? దాడి తీవ్రత ఎంత? ఆయుధాన్ని ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందా? వంటి అంశాలు దర్యాప్తులో తేలాలి. తుపాకీ లైసెన్సు వివరాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఇతర భౌతిక ఆధారాలు పరిశీలించిన తరువాతే వాస్తవాలు నిర్ధారించగలరు. పార్టీలో ఎవరి పలుకుబడి ఎక్కువన్నదానికంటే, విభేదాలను క్రమశిక్షణతో పరిష్కరించగలగడం ముఖ్యమనే ప్రశ్నను నందలూరు ఘటన ముందుకు తెచ్చింది.

**• రాళ్ల దాడులు.. వాహనాల దహనం.. పోలీసులకూ గాయాలు**

నందలూరులో ఘర్షణకు సంబంధించి వెలువడుతున్న వివరాలు పరిస్థితి ఎంత తీవ్రంగా మారిందో తెలియజేస్తున్నాయి. రాళ్లు, కర్రలు, కుర్చీలు, కూల్‌డ్రింక్ బాటిళ్లతో ఇరువర్గాల వారు దాడులు చేసుకున్నట్లు బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. ప్రత్యర్థులను వెంబడించడం, వాహనాలను ధ్వంసం చేయడం, వాటికి నిప్పంటించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో ముగ్గురికి తలపై గాయాలైనట్లు వివరాలు వెలువడ్డాయి. డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఛాతీ భాగంలో రాళ్ల దెబ్బలు తగిలాయని, పక్కటెముకలకు గాయాలై ఉండవచ్చని ఆయన వర్గం పేర్కొన్నట్లు సమాచారం. మేడా విజయశేఖర్ రెడ్డికి కాళ్లు, వీపు భాగాల్లో గాయాలైనట్లు ఆయన వర్గం చెబుతోంది. నందలూరు టీడీపీ నాయకుడు, బాలసుబ్రహ్మణ్యానికి సమీప బంధువైన సంజీవయ్య తలకు బలమైన గాయాలైనట్లు వివరాలు వెల్లడయ్యాయి. హెడ్ కానిస్టేబుల్ గురవయ్య కూడా ఘర్షణలో గాయపడినట్లు సమాచారం. అయితే, గాయాల తీవ్రత, వైద్య పరీక్షల ఫలితాలు, చికిత్స వివరాలపై అధికారిక సమాచారం అందుబాటులోకి రావాల్సి ఉంది.

మరోవైపు, వాహనాల దహనం ఘటన ప్రజా భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. రెండు కార్లు, ఒక బైక్ అగ్నికి ఆహుతైనట్లు వచ్చిన వివరాలతో పాటు, ఇతర వాహనాల అద్దాలు ధ్వంసమైనట్లు కూడా సమాచారం వెలువడింది. ఈ వాహనాలు ఎవరివి? వాటిని ధ్వంసం చేసింది ఎవరు? నిప్పంటించిన వ్యక్తులను గుర్తించారా? అనే ప్రశ్నలకు సమాధానాలు దర్యాప్తులో తేలాలి. జాతీయ రహదారిపై వాహనాలు దగ్ధమవడం, ట్రాఫిక్ నిలిచిపోవడం, ప్రయాణికులు భయాందోళనలకు గురికావడం వంటి పరిణామాలు స్థానిక రాజకీయ వివాదం సామాన్యులపై కూడా ప్రభావం చూపిందని సూచిస్తున్నాయి. ప్రజలు ప్రయాణించే రహదారిపై హింస చెలరేగడం కేవలం పార్టీ అంతర్గత సమస్య కాదు. అది శాంతిభద్రతలు, ప్రజల భద్రతకు సంబంధించిన అంశం.

**• చంద్రబాబు, లోకేశ్ దృష్టికి ఫిర్యాదు.. విచారణపై ఆసక్తి**

తనపై జరిగిన దాడులకు సంబంధించిన సమాచారాన్ని డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం టీడీపీ కేంద్ర కార్యాలయానికి, పార్టీ ముఖ్య నాయకులకు చేరవేసినట్లు వివరాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారం పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లినట్లయితే, నాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవైపు రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకుడు, మరోవైపు రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న నాయకుడు ఘర్షణలో గాయపడినట్లు వార్తలు రావడంతో ఈ ఘటనను సాధారణ స్థానిక వివాదంగా చూడలేని పరిస్థితి ఏర్పడింది. అయితే, అధిష్ఠానం ఇప్పటికే ఏదైనా నిర్ణయం తీసుకుందా? సంబంధిత నాయకులకు ఆదేశాలు ఇచ్చిందా? అనే విషయాలపై ధ్రువీకరించిన సమాచారం లేకుండా అంచనాలు వేయడం సరికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ ఈ ఘటనపై ఎలా స్పందిస్తారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. పార్టీ క్రమశిక్షణ, స్థానిక నాయకుల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపికలో వివాదాలు వంటి అంశాలపై నాయకత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కేవలం బాధితులను పరామర్శించడం, వాహనాల నష్టంపై విచారం వ్యక్తం చేయడం మాత్రమే సరిపోదు. ఘర్షణకు దారితీసిన పరిస్థితులను గుర్తించడం, దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి పాత్రను పరిశీలించడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడం కీలకం. అదే సమయంలో, ఏ వర్గం వాదననూ ముందుగానే పూర్తిగా నమ్మకుండా, పోలీసుల నివేదికలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. మేడా విజయశేఖర్ రెడ్డి వర్గం తమపై జరిగిన దాడులను పోలీసులు తీవ్రంగా పరిగణించలేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. పోలీసులు ఏ చర్యలు తీసుకున్నారు? ముందస్తు భద్రతా ఏర్పాట్లు సరిపడ్డాయా? ఘర్షణ మొదలైన తరువాత పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఏ చర్యలు చేపట్టారు? అన్నది కూడా పరిశీలించాలి. రాజకీయ పలుకుబడితో సంబంధం లేకుండా దర్యాప్తు సాగి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నప్పుడే ప్రజల్లో న్యాయంపై నమ్మకం పెరుగుతుంది.

**• నామినేషన్లకు భద్రత.. టీడీపీ నాయకత్వానికి కీలక పరీక్ష**

నందలూరు ఘటన అనంతరం నామినేషన్ల ప్రక్రియను కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించినట్లు సమాచారం. అయినప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పలు ప్రశ్నలు మిగిలాయి. అభ్యర్థులు ఎలాంటి భయం లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునే పరిస్థితి ఉందా? ఒకే పార్టీకి చెందిన వర్గాల మధ్య ఘర్షణ జరిగితే, ఇతర పార్టీల అభ్యర్థులకు తగిన భద్రత కల్పిస్తున్నారా? నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు సరిపోతుందా? వివాదాస్పద ప్రాంతాల్లో వీడియో రికార్డింగ్, సీసీ కెమెరాలు, అదనపు పోలీసు బలగాల ఏర్పాటు వంటి చర్యలు తీసుకున్నారా? అన్నది ఎన్నికల అధికారులు స్పష్టం చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాలు, మండలాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రతినిధులను ఎన్నుకునే కీలక ప్రక్రియ. అందులో అభ్యర్థులను భయపెట్టడం, నామినేషన్లకు అడ్డంకులు సృష్టించడం, దాడులకు దిగడం వంటి చర్యలకు తావుండకూడదు. మరోవైపు, రాజంపేట నియోజకవర్గంలో పార్టీ నాయకుల మధ్య సమన్వయం ఎలా ఉందన్న అంశంపైనా టీడీపీ నాయకత్వం దృష్టి పెట్టాల్సి ఉంది. ఎంపీపీ అభ్యర్థి విషయంలో ఏర్పడినట్లు చెబుతున్న వివాదం కేవలం రెండు కుటుంబాల మధ్య పోటీనా? లేక స్థానిక రాజకీయ ఆధిపత్యానికి సంబంధించిన విస్తృత విభేదాల ప్రతిబింబమా? అనేది ఇంకా స్పష్టం కావాల్సి ఉంది. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఆధారాలతోనే తేలాలి. ఎంపీపీ పీఠం ఎవరికి దక్కుతుందన్నది ఎన్నికల ప్రక్రియలో తేలవచ్చు. కానీ ఈ ఘర్షణతో గాయపడినవారి ఆరోగ్యం, దగ్ధమైన వాహనాల నష్టం, ప్రజల్లో ఏర్పడిన భయాందోళనలు, పోలీసులపై వచ్చిన ఆరోపణలు, పార్టీ ప్రతిష్ఠపై పడిన ప్రభావం వెంటనే తొలగిపోవు. అందుకే పార్టీ నాయకులు విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. అవసరమైతే అధిష్ఠానం జోక్యం కోరాలి. చట్టపరమైన మార్గాలను అనుసరించాలి. రాళ్లు, కర్రలు, బాటిళ్లతో దాడులు చేయడం, వాహనాలకు నిప్పంటించడం, కాల్పులకు దారితీసే పరిస్థితులు ఏర్పడటం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. రాజంపేటలో ఇప్పుడు తేలాల్సింది ఎంపీపీ పీఠం ఎవరిదన్నది మాత్రమే కాదు.. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించగల బాధ్యతను నాయకులు ఎలా నిర్వర్తిస్తారన్నది కూడా. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు బయటపడటం, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం, స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు భద్రత కల్పించడం అత్యంత కీలకం. ప్రజలు నాయకులను ఎన్నుకునేది తమ సమస్యలను పరిష్కరించడానికి, తమ జీవితాలను మెరుగుపరచడానికి. వ్యక్తిగత ఆధిపత్యాన్ని చాటుకోవడానికి కాదు. నందలూరు ఘటనలో ఎవరి వాదన నిజమో, ఎవరి పాత్ర ఎంతవరకు ఉందో విచారణలో తేలాలి. కానీ సొంత పార్టీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణ ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తిందన్నది మాత్రం స్పష్టం.



# రేవంత్ చేతికి గుచ్చుకోని గులాబీ ముల్లు

- అనుముల చేతిలో కార్ స్టీరింగ్
- కల్వకుంట్ల ఫ్యామిలీతో సీఎం మ్యాచ్ ఫిక్సింగ్..!?
- ధర్మపురి అరవింద్ పొలిటికల్ బ్రేకింగ్

## రెండు పార్టీల మధ్య కుదిరిన రహస్య డీలు..!

**తెలంగాణ రాజకీయాల్లో ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలు ఒక్కసారిగా వేడి పెంచాయి. సాగునీటి ప్రాజెక్టుల డిజైన్ల మార్పుల వెనుక భారీ అవినీతి ఉందని ఆరోపించిన ఆయన.. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇంతటితో ఆగని అర్వింద్.. కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన ముఖ్యమంత్రి కాలేరంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు రేవంత్ రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉందని వ్యాఖ్యానించి కొత్త చర్చకు తెరలేపారు. అసలు కేసీఆర్, రేవంత్ మధ్య తెరవెనుక ఏదైనా రాజకీయ అవగాహన ఉందా? కాంగ్రెస్, బీఆర్ఎస్ భవిష్యత్తులో చేతులు కలుపుతాయా? కేటీఆర్ నాయకత్వంపై అర్వింద్ ఎందుకు గురిపెట్టారు? ఈ ప్రశ్నలన్నింటికీ తనదైన రాజకీయ అంచనాలతో సమాధానాలు చెప్పే ప్రయత్నం చేశారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను రాజకీయంగా గల్లంతు చేస్తామని, బీజేపీ సునామీ సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాటల యుద్ధం నుంచి ఎన్నికల సమరానికి ఇప్పుడే సంకేతాలిస్తున్నారా? అర్వింద్ వ్యాఖ్యల వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇవి సంకేతాలా?**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ప్రత్యర్థులెవరు? మిత్రులెవరు? ప్రజల ముందు కత్తులు దూస్తున్న నేతలు తెరవెనుక ఎవరికి అండగా నిలుస్తున్నారు? అధికార కాంగ్రెస్‌పై బీఆర్ఎస్, బీజేపీ దాడులు చేస్తుంటే.. ఆ రెండు పార్టీల మధ్యే లోపాయికారి సంబంధాలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ మధ్యే అపవిత్ర బంధం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎదురుదాడి చేస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ నుంచి పార్టీ ఫిరాయింపుల వరకు, ఈడీ దాడుల నుంచి సింగరేణి ఆరోపణల వరకు.. ప్రతి అంశం రాజకీయ అస్త్రంగా మారుతోంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలు కొత్త చర్చకు తెరలేపాయి. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారా? బీజేపీకి బీఆర్ఎస్ సహకరిస్తోందా? కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రెండు పార్టీలు ఒక్కటవుతున్నాయా? లేక అధికారాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రతి పార్టీ తనదైన రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తోందా? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రశ్న. అయితే, పరస్పర ఆరోపణలు రాజకీయ వాదనలు మాత్రమే. వాటిని నిర్ధారిత వాస్తవాలుగా చూడలేం. నేతల మాటలు, ప్రభుత్వ విధానాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను విడివిడిగా పరిశీలించినప్పుడే అసలు రాజకీయ చిత్రంపై స్పష్టత వస్తుంది.

### • రేవంత్ వర్సెస్ బీఆర్ఎస్, బీజేపీ.. మూడు వైపులా రాజకీయ యుద్ధం

అధికారాన్ని నిలబెట్టుకోవడం ఒక ఎత్తు.. ప్రత్యర్థులను ఎదుర్కోవడం మరో ఎత్తు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పుడు ఈ రెండు సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పాలనను సమర్థించుకోవడంతో పాటు, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని లక్ష్యంగా చేసుకుంటూ రాజకీయ పోరాటాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా బీఆర్ఎస్ కనిపిస్తుండగా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, ఎన్నికల వ్యవహారాల విషయంలో బీజేపీతోనూ ఘర్షణ పెరుగుతోంది. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న రాజకీయ విభేదాలను రేవంత్ తనదైన శైలిలో ప్రజల ముందుకు తీసుకెళ్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరుగా పోరాడుతున్నట్టు కనిపించినా, కాంగ్రెస్‌ను ఇబ్బందుల్లోకి నెట్టే అంశాల్లో వాటి వైఖరి ఒకేలా ఉంటోందని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే, రెండు పార్టీలు ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నాయనే ఆరోపణకు రాజకీయ వ్యాఖ్యలకు మించిన ఆధారాలు అవసరం. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రతిపక్షాల బాధ్యత కాగా, ఆ విమర్శల వెనుక రహస్య ఒప్పందాలు ఉన్నాయా లేదా అన్నది వేరే ప్రశ్న. రేవంత్ మాత్రం ఈ రాజకీయ సంబంధాలనే తన ప్రచారంలో ప్రధాన అంశంగా మారుస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షాల విమర్శలు.. ఈ మూడింటి మధ్య తన రాజకీయ బలాన్ని నిలబెట్టుకోవడమే ఆయన ముందున్న అసలు సవాలు.

### • ఎస్ఐఆర్ చిచ్చు.. ఓట్ల కోసం పోరాటమా, హక్కుల కోసం ఆందోళనా?

ఓటర్ల జాబితా సవరణ ఇప్పుడు రాజకీయ సమరానికి కేంద్రబిందువైంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం తీవ్రంగా సాగుతోంది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ కూడా బీజేపీకి సహకరిస్తోందని విమర్శించారు. దీనికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గట్టిగా సమాధానమిస్తున్నారు. ఓటర్ల జాబితాలో ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లు, మరణించిన వారి పేర్లు, ఇతర అర్హతలేని నమోదులను తొలగించడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తున్నారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీల అమలుపై ఎదురవుతున్న విమర్శల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్ ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ మాత్రం ఓటు హక్కు పరిరక్షణను కీలక అంశంగా ముందుకు తెస్తోంది. సెప్టెంబర్‌లో కొడంగల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో రేవంత్ ఈ అంశంపై కార్యకర్తలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక్కడ అసలు పరీక్ష రాజకీయ ప్రసంగాల్లో లేదు. ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయా? అర్హులైన వారి పేర్లు తొలగిపోయాయా? అభ్యంతరాలకు సరైన పరిష్కారం లభిస్తోందా? అన్న ప్రశ్నలకు అధికారిక సమాచారం సమాధానం చెప్పాలి. ఓట్ల తొలగింపు కుట్ర జరిగిందనే ఆరోపణను నిర్ధారించడానికి ఆధారాలు అవసరం. అదే సమయంలో అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకుండా చూడటం ఎన్నికల వ్యవస్థ బాధ్యత. ఈ అంశాన్ని ఎవరు రాజకీయంగా లాభానికి ఉపయోగించుకుంటారన్నదానికంటే ప్రజాస్వామ్య హక్కులు ఎలా రక్షించబడతాయన్నదే ముఖ్యం.

### • కేటీఆర్ ఎదురుదాడి.. కాంగ్రెస్, బీజేపీ మధ్యే అపవిత్ర బంధమా?

రేవంత్ ఆరోపణలకు కేటీఆర్ తనదైన రాజకీయ అస్త్రాలతో సమాధానం ఇస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ మధ్యే లోపాయికారి సంబంధాలు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సంబంధించిన ప్రాంతాల్లో 2024 సెప్టెంబరులో ఈడీ సోదాలు జరిగినప్పటికీ, ఆ దర్యాప్తు పురోగతిపై స్పష్టమైన సమాచారం ఎందుకు బయటకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై కేంద్ర దర్యాప్తు సంస్థల మౌనాన్ని కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్నట్లు తాను భావిస్తున్న సంబంధానికి ఉదాహరణగా కేటీఆర్ ప్రస్తావించారు. 2026 సెప్టెంబరు చివరలో బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద నిరసనకు దిగడం, దర్యాప్తు స్థితిగతులపై వివరాలు కోరడం ఈ వివాదాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చాయి. ఇదే సమయంలో సింగరేణి వ్యవహారాన్ని కూడా కేటీఆర్ రాజకీయ పోరాటంలో ప్రధాన అంశంగా మార్చుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రూ.10,000 కోట్ల అక్రమాలు జరిగాయంటూ ఆరోపిస్తూ... స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. బొగ్గు కొనుగోళ్లు, విద్యుత్ రంగ నిర్ణయాలు, ఇతర ఆర్థిక ఒప్పందాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతున్నారు. కేటీఆర్ వ్యూహంలో రెండు అంశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవైపు కాంగ్రెస్ పాలనలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, మరోవైపు కేంద్రంలోని బీజేపీపై ఒత్తిడి పెంచడం. ఇలా చేయడం ద్వారా బీఆర్ఎస్ తనను కాంగ్రెస్‌కు మాత్రమే కాకుండా రెండు అధికార వ్యవస్థలను ప్రశ్నించే శక్తిగా చూపించాలనుకుంటోంది. అయితే గతంలో అధికారంలో ఉన్న పార్టీగా బీఆర్ఎస్ కూడా తన పాలనపై వచ్చిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందే. ప్రజలకు కావాల్సింది ఆరోపణల సంఖ్య కాదు. విచారణలు, పారదర్శకత, బాధ్యులపై చర్యలు.

### • అర్వింద్ వ్యాఖ్యల కలకలం.. కేసీఆర్‌ను కాపాడుతున్నదెవరు?

ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలు రాజకీయ చర్చను మరో మలుపు తిప్పుతున్నాయి. కేసీఆర్ కుటుంబాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి ఆరోపణల నుంచి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాపాడుతున్నారంటూ అర్వింద్ తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు ముందుకు సాగడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇరిగేషన్ శాఖలో కీలక నిర్ణయాలు, ఉద్యోగుల నియామకాలు, ఇతర ప్రభుత్వ వ్యవహారాలపైనా ఆరోపణలు గుప్పించారు. అర్వింద్ వ్యాఖ్యలు రాజకీయంగా ఎందుకు ప్రాధాన్యం పొందుతున్నాయంటే, కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పాలనపై విమర్శలు చేసినప్పటికీ గత ప్రభుత్వంలోని వివాదాస్పద అంశాల్లో ఎంతవరకు చర్యలు తీసుకుంటోందన్న ప్రశ్నను అవి ముందుకు తెస్తున్నాయి. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, తనను రాజకీయంగా బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెబుతోంది. బీజేపీ ఈ రెండు పార్టీలపైనా విమర్శలు చేస్తూ తనను ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలబెట్టుకోవాలని చూస్తోంది. దీంతో ఒకే అంశంపై మూడు పార్టీలకు మూడు కథనాలు తయారవుతున్నాయి. కాంగ్రెస్ దృష్టిలో గత ప్రభుత్వ వైఫల్యాలు ప్రధాన అంశం. బీఆర్ఎస్ దృష్టిలో ప్రస్తుత ప్రభుత్వ హామీల వైఫల్యం కీలకం. బీజేపీ దృష్టిలో రెండు ప్రాంతీయ రాజకీయ శక్తుల పాలనా విధానాలను ప్రశ్నించడమే తమ పని‌గా భావిస్తోంది.

• **తోకల సుధాకర్ పటేల్**

### తెరవెనుక మిత్రులెవరు? ప్రజల తీర్పే అసలు ఫైర్ టెస్ట్!

తెలంగాణ రాజకీయాల్లో ఎవరు ఎవరితో ఉన్నారన్న ప్రశ్నకు సమాధానం నినాదాల్లో దొరకదు. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య సాగుతున్న మాటల యుద్ధం రాష్ట్ర రాజకీయాల్లో పోటీ ఎంత తీవ్రంగా ఉందో చూపిస్తోంది. రేవంత్ రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య సంబంధాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ కాంగ్రెస్, బీజేపీ మధ్య అపవిత్ర బంధం ఉందని ఆరోపిస్తున్నారు. కిషన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలును ప్రశ్నిస్తున్నారు. ధర్మపురి అర్వింద్ కేసీఆర్ కుటుంబం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిలదీస్తున్నారు. ఈ పరస్పర విమర్శల్లో ప్రతి పార్టీ తన రాజకీయ ప్రయోజనానికి అనుగుణంగా అంశాలను ముందుకు తెస్తోంది. అయితే ఎవరు ఎవరిని కాపాడుతున్నారు? ఎవరు ఎవరితో కుమ్మక్కయ్యారు? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటే రాజకీయ ఆరోపణలకు మించి ఆధారాలను పరిశీలించాలి. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ప్రజల హక్కులు రక్షించబడుతున్నాయా? ఈడీ దర్యాప్తులపై స్పష్టత వస్తోందా? సింగరేణి ఆరోపణలపై విచారణ జరుగుతోందా? కాళేశ్వరం ప్రాజెక్టుపై బాధ్యతలు నిర్ణయించబడుతున్నాయా? కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేస్తోందా? బీజేపీ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందా? బీఆర్ఎస్ తన గత పాలనపై వచ్చిన ప్రశ్నలకు సమాధానం చెబుతోందా? ఇవే ప్రజలు అడగాల్సిన ప్రశ్నలు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం ప్రజాస్వామ్యంలో సహజం. కానీ ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఆరోపణల చుట్టూ రాజకీయాలు తిరిగితే నష్టపోయేది ప్రజలే. తెలంగాణలో అసలు పోరు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మాత్రమే కాదు... బీజేపీ తన రాజకీయ స్థానం బలోపేతం చేసుకునే పోరు కూడా. ఈ మూడు పార్టీల మధ్య వ్యూహాలు మారవచ్చు.. విమర్శలు పెరగవచ్చు... రాజకీయ సమీకరణాలు కొత్త మలుపులు తిరగవచ్చు. కానీ అంతిమంగా ప్రజలు కోరుకునేది స్థిరమైన పాలన, ఉద్యోగాలు, రైతులకు భరోసా, విద్యుత్ సరఫరా, అవినీతిపై చర్యలు, పారదర్శకమైన వ్యవస్థ. అందుకే తెలంగాణ రాజకీయాల్లో ఎవరు ఎవరికి ప్రత్యర్థి అన్నదానికంటే ఎవరు ప్రజల పక్షాన నిలుస్తున్నారు అన్నదే కీలకం. మాటల యుద్ధంలో ఎవరు గెలిచారన్నది తాత్కాలికం.. ప్రజల విశ్వాసాన్ని ఎవరు గెలుచుకుంటారన్నదే అసలైన రాజకీయ ఫైర్ టెస్ట్!





### • కిషన్ రెడ్డి టార్గెట్.. బీజేపీని నిలదీస్తున్న రేవంత్

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీజేపీ మరో కీలక రాజకీయ ప్రత్యర్థి. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని రేవంత్ రెడ్డి విమర్శలు చేయడం వెనుక రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవాలనే వ్యూహం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌పై ప్రజల్లో అసంతృప్తి పెరిగితే, దాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర ఎన్నికల హామీల అమలుపై కిషన్ రెడ్డి ప్రశ్నలు సంధిస్తున్నారు. రైతులు, నిరుద్యోగులు, విద్యుత్ సమస్యలు, ప్రభుత్వ పనితీరు వంటి అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై రేవంత్ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. రైతుల ఆదాయం, నల్లధనం, ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో బీజేపీ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కేంద్రం తగిన సహకారం అందించడం లేదనే వాదనను కూడా కాంగ్రెస్ ముందుకు తెస్తోంది. ఇక్కడ రెండు పార్టీల మధ్య పోరు కేవలం నాయకుల వ్యక్తిగత విమర్శలకు పరిమితం కావడం లేదు. కేంద్రం వర్సెస్ రాష్ట్రం అనే రాజకీయ కోణాన్ని కూడా సంతరించుకుంటోంది. అయితే కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి మధ్య విమర్శలు పెరిగినంత మాత్రాన బీజేపీ, కాంగ్రెస్ మధ్య తెరవెనుక సంబంధాలు ఉన్నాయని తేల్చలేం. అలాగే ఒక పార్టీ మరొక పార్టీపై విమర్శలు చేయడం వల్ల ప్రజా సమస్యలకు పరిష్కారం లభించదు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల పురోగతి, రైతులకు అందుతున్న సహాయం, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై స్పష్టమైన లెక్కలు అవసరం. బీజేపీకి రాష్ట్రంలో రాజకీయ అవకాశాలు పెరగాలంటే ప్రభుత్వ వ్యతిరేకతను మాత్రమే నమ్ముకోకుండా తన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కాంగ్రెస్‌కు ప్రజల మద్దతు నిలవాలంటే ప్రతిపక్షాలపై ఎదురుదాడితో పాటు పాలనా ఫలితాలను చూపించాలి. ఈ పోరులో ఎవరు పైచేయి సాధిస్తారన్నది మాటల తీవ్రతపై కాకుండా ప్రజల అనుభవాలపై ఆధారపడి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రెండున్నరేళ్ల కూటమి ప్రయాణంపై కొత్త చర్చ మొదలైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అధికార భాగస్వాముల మధ్య సీట్ల పంపకం, పరస్పర గౌరవం, పాలనలో భాగస్వామ్యం, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై అసంతృప్తి పెరుగుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైఖరిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. "మీరు చేయాల్సింది మీరు చేస్తే.. నేను చేయాల్సింది నేను చేస్తా" అన్న ధోరణిలో ఆయన మాట్లాడినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న పూర్తి సందర్భం, అధికారికంగా జరిగిన చర్చల వివరాలు, కూటమి భవిష్యత్తుపై తీసుకున్న నిర్ణయాలు స్పష్టంగా వెల్లడికాలేదు. అందువల్ల ఈ పరిణామాలను పూర్తి స్థాయిలో ఖరారైన నిర్ణయాలుగా కాకుండా, కూటమిలోని అంతర్గత విభేదాలపై వెలువడుతున్న సంకేతాలుగా చూడాల్సి ఉంది. మరోవైపు, బీజేపీ వర్గాల్లోనూ కొన్ని పరిణామాలపై అసంతృప్తి ఉందన్న ప్రచారం వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి భాగస్వాములు తమ మధ్య ఉన్న సమస్యలను ఎలా పరిష్కరించుకుంటారన్నది కీలకంగా మారింది. బయటకు ఐక్యత కనిపిస్తున్నా, లోపల మాత్రం తమ రాజకీయ స్థానం, గౌరవం, భవిష్యత్ ప్రయోజనాలపై లెక్కలు వేసుకుంటున్నారా అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.





# అల్టిమేటమ్!?

- ఎన్నికల హింసపై చర్చ
- సుప్రీం తీర్పుతో కొత్త ట్విస్ట్
- నాడు వైసీపీలా మనం చేస్తే ఎలా?

# బాబుతో పవన్ భేటీ

### వైసీపీ చేసినట్టుగా కూటమి చేస్తే ఎలా?

నాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తామంటే ఎలా.. ఇదీ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ మనసులో మాట. వాళ్లు తప్పు చేశారు కాబట్టి మనం చేస్తామా.. కోర్టులు మొట్టికాయలు వేసుకునేలా పరిస్థితి ఎందుకు తెచ్చుకోవాలన్నది ఆయన నేరుగా టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. మీకు నచ్చినట్టుగా మీరు చేస్తే.. మీ వల్ల మేము బద్నాం కాలేం.. ఇలా ఐతే కష్టం.. జాగ్రత్తపడంటి లేకుంటే కూటమికే ఇబ్బందన్న సందేశాన్ని పవన్ నేరుగా చంద్రబాబుకు చేరవేసినట్టుగా కొన్ని వర్గాల నుంచి తెలుస్తోంది. ఎవరూ లేకుండా పవన్ కళ్యాణ్ నేరుగా చంద్రబాబును కలిసి, తన మనసులో మాట చెప్పినట్టుగా జనసేన వర్గీయులు ఆఫ్ ద రికార్డ్ చెబుతున్నారు. వాస్తవానికి ఇవాళ పవన్ కళ్యాణ్ ఫేక్ వాట్సాప్ అకౌంట్ ద్వారా ఆయన రాజీనామా చేస్తున్నారన్న ప్రచారం దావనంలా వ్యాపించింది. ఇది ఫేక్ అని పవన్ కళ్యాణ్ కార్యాలయం ఖండించింది. అయితే.. ఇప్పుడు చెబుతున్న పరిణామాలకు, ఆ ఫేక్ ప్రచారాలను రెండు వేర్వేరు అంశాలుగా చూడాల్సి ఉంటుంది. రిజైన్ చేయాలా.. పొత్తులో ఉండాలా.. అన్న చర్చ.. అటు చంద్రబాబు, ఇటు పవన్ కళ్యాణ్ మధ్య జరిగిందో లేదో చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. ఐతే మనకు అందుతున్న సమాచారం మేరకు టీడీపీకి నచ్చినట్టుగా అన్నీ చేసుకుంటే.. ఆ మైనస్‌లను మేం మేయలేమన్న భావనకు పవన్ వచ్చారన్న సందేశం మాత్రం అందుతోంది. నాడు 2014 ఎన్నికల్లో కూటమికి జై కొట్టిన పవన్ ఆ తర్వాత కొన్ని రోజులకు టీడీపీపై నిప్పులు చెరిగారు. బీజేపీ గురించి ఎన్ని మాటలన్నారో మనం విన్నాం కూడా.. అయితే ఆ రోజులు వేరు.. ఈ రోజులు వేరు. నాడు పవన్ కళ్యాణ్ ఔట్ సైడర్.. నేడు ఆయన ఇన్ సైడర్.. సో.. ఇప్పుడు నాడు మాట్లాడినట్టుగా.. నాడు వ్యవహరించినట్టుగా ఆయన చేస్తారనుకోలేం. ఒక్కటి మాత్రం నిజం మనతో ఉండేవారెవరైనా మన వల్ల కలిగే లాభం కోరుకుంటారు గానీ.. నష్టాన్ని కోరుకోరు కదా!

### పవన్ హెచ్చరిక వెనుక సహనం, స్వాభిమాన సందేశం

పవన్ కళ్యాణ్‌కు ఆపాదిస్తున్న వ్యాఖ్యల్లో ప్రధానంగా కనిపిస్తున్న అంశం పరస్పర బాధ్యత. ఒక పార్టీ తన నిర్ణయాలు తాను తీసుకుంటే, మరో పార్టీ కూడా తన రాజకీయ భవిష్యత్తుపై స్వతంత్రంగా ఆలోచించే హక్కును కలిగి ఉంటుందన్న భావన ఇందులో కనిపిస్తోంది. అయితే ఈ మాటలు ఏ సందర్భంలో, ఎవరిని ఉద్దేశించి చెప్పారనే విషయంపై అధికారిక ధ్రువీకరణ అవసరం. రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం, కూటమి భాగస్వామ్యాల మధ్య ఉన్న సమస్యలను ఎంతకాలం భరించాలి... ఏ దశలో స్పష్టమైన వైఖరి ప్రకటించాలి అనే అంశాలపై చర్చ జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ ప్రచారాన్ని నిజమని నిర్ధారించలేకపోయినా, ఇందులో లేవనెత్తిన రాజకీయ ప్రశ్న మాత్రం ప్రాధాన్యమైనది. ఒక పార్టీ అధినేత తన శ్రేణులకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, కార్యకర్తలకు కల్పించిన ఆశలు, అధికారంలోకి వచ్చిన తరువాత అమలవుతున్న నిర్ణయాల మధ్య తేడా కనిపిస్తే నాయకత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. జనసేనకు సంబంధించిన రాజకీయ అంశాల్లో కూడా ఇలాంటి ప్రశ్నలు ఉన్నాయన్నది పరిశీలించాల్సిన విషయం. కూటమిలో కొనసాగడం కోసం స్వాభిమానాన్ని పక్కన పెట్టాలా? లేక విభేదాలను బహిరంగంగా వ్యక్తం చేయాలా? అనేది ఏ పార్టీ అయినా ఎదుర్కొనే రాజకీయ సందిగ్ధత. పవన్ కళ్యాణ్ విషయంలోనూ ఇలాంటి ప్రశ్నలు చర్చకు వస్తున్నాయి.

### కూటమి సమీకరణాల్లో మారుతున్న అంచనాలు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మధ్య సంబంధాలు కూటమి భవిష్యత్తును ప్రభావితం చేసే ముఖ్యమైన అంశం. ఈ మూడు పార్టీలకు వేర్వేరు రాజకీయ నేపథ్యాలు, సంస్థాగత బలాలు, కార్యకర్తల అంచనాలు ఉన్నాయి. అందువల్ల ప్రతి నిర్ణయంలోనూ ఒకే రకమైన అభిప్రాయం ఉండకపోవచ్చు. ఏదైనా అంశంపై ఒక పార్టీకి అభ్యంతరం ఉంటే, మరో పార్టీకి అది పెద్ద సమస్యగా కనిపించకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో చర్చలు, సమన్వయం, పరస్పర అవగాహన కీలకంగా మారతాయి. బీజేపీ వర్గాలు కూడా కొన్ని పరిణామాలపై అసంతృప్తిగా ఉన్నాయని ప్రచారం వినిపిస్తున్నప్పటికీ, ప్రస్తుతం అందరూ మౌనం ఆశ్రయిస్తున్నారు. కాబట్టి బీజేపీ కూటమికి అల్టిమేటమ్ ఇచ్చిందని లేదా ఏదైనా కీలక నిర్ణయం తీసుకుందని చెప్పడం తొందరపాటు అవుతుంది. అయినప్పటికీ, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం బలహీనపడితే దాని ప్రభావం రాజకీయ సందేశంపై పడుతుంది. రాష్ట్రంలో పాలనకు సంబంధించిన నిర్ణయాలు, కేంద్రంతో సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల వ్యూహాలు వంటి అంశాల్లో భాగస్వాముల మధ్య స్పష్టత అవసరం. ఒక పార్టీకి కలిగిన రాజకీయ ఇబ్బంది మొత్తం కూటమి విశ్వసనీయతను ప్రభావితం చేయవచ్చు. అందువల్ల ఏ పార్టీ సమస్యనైనా ఇతర భాగస్వాములు తమకు సంబంధం లేదన్నట్లుగా చూడలేవు. ఇదే సమయంలో ప్రతి పార్టీ తన సిద్ధాంతాలకు, రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛను కూడా కాపాడుకోవాలి. ఈ రెండు అంశాల మధ్య సమతూకం సాధించగలిగితేనే కూటమి సమన్వయం నిలకడగా ఉంటుంది.



### అసంతృప్తికి అసలు కారణం సీట్ల పంపకాలేనా?

కూటమిలో విభేదాలు ఉన్నాయనే చర్చకు ప్రధాన కారణంగా సీట్ల పంపకం, నిర్ణయాధికారం, భాగస్వామ్య పార్టీలకు లభిస్తున్న ప్రాధాన్యం వంటి అంశాలను రాజకీయ పరిశీలకులు ప్రస్తావిస్తున్నారు. ఎన్నికల సమయంలో కలిసి పోటీ చేయడం ఒక ఎత్తయితే, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి పార్టీకి తగిన గుర్తింపు ఇవ్వడం మరో ఎత్తు. ముఖ్యంగా జనసేన తనకు కేటాయించిన స్థానాలు, రాజకీయంగా తనకు లభిస్తున్న ప్రాధాన్యం, పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న పరిస్థితులపై సంతృప్తిగా ఉందా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీతో కలిసి నడవడం ద్వారా జనసేన సాధించాలనుకున్న రాజకీయ లక్ష్యాలు ఎంతవరకు నెరవేరుతున్నాయన్న ప్రశ్న కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే సీట్ల పంపకంపై ప్రస్తుతం ఏదైనా నిర్దిష్ట నిర్ణయం తీసుకున్నారని లేదా కూటమి నుంచి బయటకు రావాలని అధికారికంగా నిర్ణయించుకున్నారని నిర్ధారించే సమాచారం లేదు. అయినప్పటికీ, భాగస్వామ్య పార్టీల మధ్య అసంతృప్తి పెరిగితే దాని ప్రభావం ప్రభుత్వ నిర్ణయాలపై, భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలపై పడే అవకాశం ఉంటుంది. పొత్తు అంటే కేవలం ఎన్నికల్లో సీట్లు పంచుకోవడం కాదు... పరస్పర గౌరవం, విశ్వాసం, రాజకీయ స్వతంత్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం. ఈ సూత్రాల అమలుపై ఏవైనా ప్రశ్నలు తలెత్తితే వాటిని అంతర్గతంగా పరిష్కరించుకోవాల్సిన బాధ్యత భాగస్వాములందరిపైనా ఉంటుంది. ఈ అంశాలే ప్రస్తుత రాజకీయ చర్చకు నేపథ్యంగా కనిపిస్తున్నాయి.

### వంద తప్పుల లెక్కనా.. ఒక్కసారిగా నిర్ణయమా?

పవన్ కళ్యాణ్ వైఖరిపై జరుగుతున్న చర్చల్లో ఒక ముఖ్యమైన పోలిక వినిపిస్తోంది. చిన్న చిన్న సమస్యలను వెంటనే బహిరంగ వివాదాలుగా మార్చకుండా, కొంతకాలం పరిశీలించి, తగిన సమయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకునే నాయకత్వ శైలి గురించి రాజకీయ వర్గాలు మాట్లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో శిశుపాలుడి వంద తప్పుల కథను ఉదాహరణగా ప్రస్తావిస్తున్నారు. తప్పులు పేరుకుపోతున్నప్పుడు మౌనంగా ఉండటం, ఒక దశలో మాత్రం గట్టిగా స్పందించడం అనే భావనను ఆయన మద్దతుదారులు వ్యక్తం చేస్తుంటారు. అధికారంలో భాగస్వామిగా ఉన్న పార్టీకి కొన్ని అంశాలపై అభ్యంతరాలు ఉంటే వాటిని అంతర్గత సమావేశాల్లో పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. ఆ మార్గం పని చేయకపోతే బహిరంగ ప్రకటనలు, రాజకీయ హెచ్చరికలు, భవిష్యత్తు వ్యూహాల్లో మార్పులు చోటుచేసుకోవచ్చు. రాజకీయాల్లో మౌనం ఎప్పుడూ అంగీకారం కాదు... విమర్శ ఎప్పుడూ పొత్తు ముగింపుకు సంకేతం కూడా కాదు. సందర్భాన్ని బట్టి వాటి అర్థాలు మారుతాయి. అందువల్ల పవన్ కళ్యాణ్ నుంచి వెలువడుతున్నట్లు ప్రచారంలో ఉన్న సందేశాలను కూటమి భవిష్యత్తుపై తుది నిర్ణయంగా భావించకూడదు. అయితే భాగస్వాముల మధ్య సమస్యలు పరిష్కారం కాకుండా కొనసాగితే, అవి ఒక దశలో రాజకీయ నిర్ణయాలకు దారితీయవచ్చన్న విషయాన్ని విస్మరించలేం. ఈ దశలో కీలకమైనది పరస్పర విశ్వాసాన్ని నిలబెట్టడం, విభేదాలను బహిరంగ ఘర్షణలుగా మారకుండా చూడటం.

### అల్టిమేటమ్ ఉంటుందా? పొత్తు కొనసాగుతుందా?

ప్రస్తుతం తెరపైకి వస్తున్న ప్రశ్నలు రెండే. జనసేన కూటమిలోనే కొనసాగుతూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తుందా? లేక తన రాజకీయ స్వతంత్రతను మరింత స్పష్టంగా ప్రకటించే దిశగా అడుగులు వేస్తుందా? ఈ రెండు అవకాశాల గురించి చర్చ జరుగుతున్నప్పటికీ, ఏదో ఒకటి ఖరారైందని చెప్పే అధికారిక ఆధారం లేదు. పవన్ కళ్యాణ్ రాజీనామా చేయాలనే నిర్ణయం తీసుకున్నారని, కూటమి నుంచి బయటకు రావాలని తేల్చుకున్నారని చెప్పలేం. కాకుంటే ఆయన ఆలోచనల్లో మార్పు రావడానికి పరిస్థితులు కారణమవుతున్నాయని మాత్రం చెప్పొచ్చు. ఇదే సమయంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తేల్చడం కూడా సరైంది కాదు. రాజకీయాల్లో విభేదాలు సహజం. వాటిని పరిష్కరించుకునే విధానం, భాగస్వాములకు ఇచ్చే గౌరవం, ప్రజలకు అందించే పాలన ఫలితాలే కూటమి బలాన్ని నిర్ణయిస్తాయి. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు జోక్యం ప్రభుత్వానికి, ఎన్నికల యంత్రాంగానికి బాధ్యతలను గుర్తుచేసింది. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో కూటమి భాగస్వాములు తమ వైఖరిని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్న చర్చకు ప్రాధాన్యం పెరిగింది. అల్టిమేటమ్ ఇచ్చారనే ప్రచారం కంటే, సమస్యలపై నాయకులు ఏం చెబుతున్నారు, ఏ నిర్ణయాలు తీసుకుంటున్నారు అనేదే ముఖ్యం. కూటమి భవిష్యత్తు ఒకరి వ్యాఖ్యతోనో, ఒక రోజు జరిగిన సమావేశంతోనో నిర్ణయమైపోదు. పరస్పర విశ్వాసం, రాజకీయ ప్రయోజనాలు, పాలనా బాధ్యతలు, ప్రజల ముందు నిలబడగలిగే విశ్వసనీయత.. ఈ అంశాలన్నీ కలిసి దాని దిశను నిర్ణయిస్తాయి. ఇదే ప్రస్తుత పరిణామాల్లో కీలకమైన రాజకీయ సందేశం.

– కేసానపల్లి కోటేశ్వరరావు
ఇన్‌పుట్ ఎడిటర్, నాదేశం



### స్థానిక ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై తలెత్తిన వివాదం కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా సవాలుగా మారింది. నామినేషన్లు దాఖలు చేయకుండా తమ అభ్యర్థులను అడ్డుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించగా, ఈ ఫిర్యాదులను పరిశీలించాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 21న రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. నామినేషన్ల దాఖలుకు అవకాశం లభించలేదని అభ్యర్థులు చేసిన ఫిర్యాదులు, అందించిన ఆధారాలను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో గడువు పొడిగించాలా లేదా నిర్ణయించాలని సూచించింది. తుది అభ్యర్థుల జాబితా ప్రచురణను వాయిదా వేయాలని, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని కూడా ఆదేశించింది. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల తదుపరి ప్రక్రియను నిలిపివేసింది. అయినప్పటికీ, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ప్రతి అభ్యర్థికి అందుబాటులో ఉండాలనే అంశంపై సుప్రీంకోర్టు స్పష్టమైన దృష్టి పెట్టింది. ఈ పరిణామం కూటమి భాగస్వాముల మధ్య చర్చలకు మరో కోణాన్ని జోడించింది. ఇక్కడే పవన్ కళ్యాణ్ టీడీపీపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మీ పార్టీ చేసే అరాచకాలకు మిమ్మల్ని బాధ్యులు చేస్తున్నారు.. పవన్ కళ్యాణ్ ఉండి కూడా ఇలా ఏంటన్న చర్చ జరుగుతోంది. బీజేపీ జాతీయ నాయకత్వానికి ఇబ్బందికర పరిస్థితి అన్న భావన కలుగుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడే కూటమి పార్టీల మధ్య ట్రిగ్గర్ పాయింట్ ఉంది. ఇదే టీడీపీని టార్గెట్ చేసే పాయింట్ అవుతోంది.

# కివీస్‌పై భారత్ రికార్డు ఛేజింగ్

## ఉత్కంఠ పోరులో ఎమేజింగ్



న్యూజిలాండ్ గడ్డపై పరుగుల వరద.. ఉత్కంఠభరిత పోరులో టీమిండియా మరోసారి తన బ్యాటింగ్ బలాన్ని చాటుకుంది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన తొలి టీ20లో పరుగుల సునామీ సృష్టించిన కివీస్‌కు భారత బ్యాటర్లు అదిరిపోయే సమాధానమిచ్చారు. గ్లెన్ ఫిలిప్స్ 40 బంతుల్లో అజేయంగా 82 పరుగులతో విరుచుకుపడటంతో న్యూజిలాండ్ 225/4 స్కోరుతో భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫిన్ అలెన్ 24 బంతుల్లో 45 పరుగులతో మెరుపు ఆరంభాన్ని అందించగా, బౌండరీలు, సిక్సర్లతో హాగ్లీ ఓవల్ మైదానాన్ని హోరెత్తించాడు. అయితే భారత జట్టు లక్ష్యఛేదనలో సంజూ శాంసన్, అభిషేక్ శర్మ విధ్వంసమే అసలు కథకు తెరలేపింది. తొలి వికెట్‌కు కేవలం 35 బంతుల్లోనే 93 పరుగులు జోడించి కివీస్ బౌలర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. శాంసన్ 28 బంతుల్లో 67 పరుగులతో చెలరేగగా, అభిషేక్ 12 బంతుల్లో 29 పరుగులు సాధించాడు. కానీ మైకేల్ బ్రేస్‌వెల్, మిచెల్ సాంట్నర్ స్పిన్ ఉచ్చులో భారత్ చిక్కుకోవడంతో 29 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి ఒక్కసారిగా ఒత్తిడిలో పడింది. ఆ సమయంలో శ్రేయస్ అయ్యర్ 42, అక్షర్ పటేల్ 24 పరుగులతో కీలక భాగస్వామ్యం నెలకొల్పి ఆశలు నిలిపారు. చివర్లో నామన్ ధీర్ 32 బంతుల్లో అజేయంగా 42 పరుగులతో బాధ్యతాయుతంగా ఆడుతూ విజయానికి బాటలు వేశాడు. చివరి క్షణాల్లో ఒత్తిడిని ఛేదిస్తూ రెండు బంతులు మిగిలుండగానే భారత్ 230/6తో లక్ష్యాన్ని అందుకుంది. నాలుగు వికెట్ల తేడాతో గెలిచి టీ20 సిరీస్‌ను ఘనంగా ఆరంభించింది. ఫిలిప్స్ విధ్వంసక ఇన్నింగ్స్ వృథా కాగా, భారత బ్యాటింగ్ లోతు విజయానికి అసలైన బలంగా నిలిచింది.

# ఇంగ్లాండ్‌పై శ్రీలంక రికార్డు విక్టరీ

- 430 పరుగుల లక్ష్యం ఛేదించి చరిత్ర
- బ్రూక్ డబుల్ సెంచరీకి షాక్!
- శ్రీలంక సంచలన విజయం!




రికార్డుల వేటలో లంక వీరులు.. క్రికెట్ చరిత్రలో నిలిచిపోయే పోరులో శ్రీలంక అద్భుతం చేసింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 430 పరుగుల అసాధ్యమనిపించిన లక్ష్యాన్ని ఛేదించి సంచలన విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ విధ్వంసక ద్విశతకంతో విరుచుకుపడ్డాడు. కేవలం 116 బంతుల్లో 202 పరుగులు సాధించి బౌలర్లను ఉతికారేశాడు. టామ్ బాంటన్ 50, జో రూట్ 69, విల్ జాక్స్ 30 బంతుల్లో అజేయంగా 66 పరుగులతో మెరవడంతో ఇంగ్లాండ్ 50 ఓవర్లలో 429/4 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంతటి కొండంత లక్ష్యం ముందు శ్రీలంక తలవంచుతుందని భావించిన అభిమానులకు ఆ జట్టు బ్యాటర్లు దిమ్మతిరిగే సమాధానమిచ్చారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన లంక బ్యాట్స్‌మెన్ చెలరేగిపోయారు. ఫెర్నాండో, రత్నాయకే దంచుడు.. అవిష్క ఫెర్నాండో 83 బంతుల్లో 97 పరుగులతో ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేశాడు. అనంతరం పవన్ రత్నాయకే అద్భుత పోరాటంతో చెలరేగి 106 బంతుల్లో 130 పరుగులు సాధించాడు. వీరిద్దరి దూకుడుతో లక్ష్యం దిశగా శ్రీలంక దూసుకెళ్లింది. ఇక చివరి దశలో దసున్ శనక విధ్వంసమే సృష్టించాడు. కేవలం 50 బంతుల్లో 97 పరుగులు బాది ఇంగ్లాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చివర్లో జనిత్ లియనాగే 27 బంతుల్లో అజేయంగా 61 పరుగులు సాధించి విజయాన్ని ఖాయం చేశాడు. 49.5 ఓవర్లలో 430/8 పరుగులు చేసిన శ్రీలంక, ఎనిమిది వికెట్లు కోల్పోయినా లక్ష్యాన్ని అందుకుంది. బ్రూక్ ద్విశతకం, ఇంగ్లాండ్ భారీ స్కోరు అన్నీ మరుగునపడేలా లంక బ్యాటర్లు అసాధారణ పోరాటం చేశారు. 430 పరుగుల ఛేదనతో శ్రీలంక క్రికెట్ అభిమానులకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.

# సంజూ సీక్రెట్ ఇదే

## బాదుడే బాదుడు..!



న్యూజిలాండ్ గడ్డపై పరుగుల సునామీ సృష్టించి టీమిండియాకు చారిత్రక విజయాన్ని అందించిన సంజూ శాంసన్ తన బ్యాటింగ్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని బయటపెట్టాడు. భారీ లక్ష్యమైన 226 పరుగుల ఛేదనలో 33 బంతుల్లోనే 67 పరుగులు బాది కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన సంజూ.. తన విధానం వెనుక ఎలాంటి పెద్ద వ్యూహం లేదని స్పష్టం చేశాడు. "బంతిని గమనించాలి.. గట్టిగా బాదాలి.. అంతే!" అన్నదే తన బ్యాటింగ్ సూత్రమని వెల్లడించాడు. అభిషేక్ శర్మతో కలిసి ఆడటాన్ని ఆస్వాదిస్తానన్న సంజూ, పవర్‌ప్లేలో సానుకూల దూకుడే తమ విజయ రహస్యమని చెప్పాడు. ఈ జోడీ కేవలం 35 బంతుల్లోనే 93 పరుగులు జోడించి భారత్‌కు మెరుపు ఆరంభాన్ని అందించింది. సంజూ ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విరుచుకుపడగా.. అభిషేక్ 12 బంతుల్లో 29 పరుగులతో దూకుడు ప్రదర్శించాడు. ఆరంభంలోనే 90 పరుగుల మార్కును దాటడంతో మ్యాచ్‌ను త్వరగానే ముగించగలమని భావించామని సంజూ వెల్లడించాడు. అయితే వరుస వికెట్లతో భారత్ ఒత్తిడిలో పడినా, శ్రేయస్ అయ్యర్, నామన్ ధీర్ కీలక ఇన్నింగ్స్‌లతో జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ గెలుపు తన ఒక్కడి ఘనత కాదని, జట్టులో ప్రతి ఒక్కరి సహకారం ఉందని సంజూ పేర్కొన్నాడు. వికెట్ కీపింగ్ సమయంలో పిచ్‌ను అంచనా వేసినా, భారీ మంచు కారణంగా బ్యాటింగ్ పరిస్థితులు మారాయని వివరించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన సంజూ, ఐదు టీ20ల సిరీస్‌లో భారత్‌కు శుభారంభాన్ని అందించి అభిమానుల్లో కొత్త ఉత్సాహం నింపాడు.

# బ్రూక్ డబుల్ సెంచరీ!

- ఇంగ్లాండ్ కెప్టెన్ హిస్టరీ
- శుభ్‌మన్ గిల్ రికార్డు బద్దలు
- వన్డే చరిత్రలో సంచలనాలు

వన్డే క్రికెట్‌లో రికార్డుల పుస్తకం తిరగబడింది! ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఉర్రూతలూగించాడు. శ్రీలంకతో జరిగిన ముక్కోణపు టోర్నీ మ్యాచ్‌లో కేవలం 114 బంతుల్లోనే డబుల్ సెంచరీ సాధించి పురుషుల వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ నమోదు చేశాడు. భారత యువ సంచలనం శుభ్‌మన్ గిల్ గత నెలలో వెస్టిండీస్‌పై 116 బంతుల్లో నెలకొల్పిన రికార్డును రెండు బంతులు ముందుగానే బద్దలుకొట్టాడు. బ్రూక్ బ్యాట్ నుంచి 21 ఫోర్లు, 10 సిక్సర్లు జాలువారగా.. మైదానమంతా బౌండరీల మోతతో మార్మోగింది. 75 బంతుల్లో శతకం అందుకున్న అతడు, ఆ తర్వాత మరింత వేగం పెంచి కేవలం 39 బంతుల్లోనే మరో వంద పరుగులు పూర్తి చేశాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి 202 పరుగుల వద్ద ఔటైనా, అప్పటికే క్రికెట్ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు.









# భక్తి మాధుర్యంతో బ్లాక్‌బస్టర్..!

## కిరణ్ అబ్బవరం 'రియాలిటీ'

సినిమా అంటే కేవలం యాక్షన్, ప్రేమకథలు, భారీ డైలాగులే కాదు.. మనసును తాకే భావోద్వేగాలు, జీవితానికి అర్థం చెప్పే పాటలు కూడా! ఈ విషయాన్ని మరోసారి గుర్తుచేస్తూ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్ఠాత్మక చిత్రం రియాలిటీ నుంచి 'భజగోవిందం' వీడియో సాంగ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. టైటిల్ గ్లింప్స్‌తో ఆసక్తి రేపిన ఈ సినిమా నుంచి విడుదలైన పాట ఇప్పుడు భక్తి భావనతో పాటు ఆహ్లాదకరమైన సంగీతాన్ని అందిస్తోంది. భీమ్స్ సిసిరోలియో స్వరాలు ఈ గీతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, సనారే అందించిన అర్థవంతమైన సాహిత్యం జీవిత సత్యాలను సున్నితంగా ఆవిష్కరిస్తోంది. మన దగ్గర ఉన్నదానిలో ఆనందాన్ని వెతుక్కోవడం, చేసే పనిలో సంతృప్తిని పొందడం, మనపై మనం నమ్మకం పెంచుకోవడం వంటి సందేశాలతో పాట హృదయాన్ని హత్తుకుంటోంది. వైకోమ్ విజయలక్ష్మి గాత్రం ఈ మెలోడీకి దైవికమైన మాధుర్యాన్ని అద్దింది. గ్రామీణ జీవనంలోని అందాలు, చిన్నచిన్న సంతోషాలు, ఆత్మీయ అనుబంధాలను ప్రతిబింబించే విజువల్స్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ఇందులో కిరణ్ అబ్బవరం హోటల్ నిర్వహిస్తూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో సరదాగా గడిపే క్షణాలు కనిపిస్తాయి. సాధారణ జీవితంలోనే అసలైన ఆనందం దాగి ఉంటుందనే భావనను ఈ పాట చక్కగా చాటుతోంది. ఈ చిత్రంలో దేవికా భట్ కథానాయికగా నటిస్తున్నారు. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్న ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు కిరణ్ అబ్బవరం దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న సినిమా విడుదల కానుంది. మొత్తంగా 'భజగోవిందం' భక్తి, భావోద్వేగం, మధురమైన సంగీతం కలగలిసిన గీతంగా ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించేందుకు సిద్ధమైంది.



# అందుకు గర్వపడుతున్నా

- అన్ని భాషల్లోనూ నటిస్తా!
- ట్రోలింగ్‌పై తగ్గేదేలేదన్న రష్మిక

భాష వేరు.. యాస వేరు.. కానీ నటనకు హద్దులెక్కడ? దక్షిణాది యాసపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గేది లేదని నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన మాటలతో స్పష్టం చేసింది. బాలీవుడ్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి నటన, భాష, డైలాగ్ డెలివరీ, యాస అంటూ తనను టార్గెట్ చేసిన ట్రోలర్లకు ఈ బ్యూటీ గట్టిగానే సమాధానమిచ్చింది. కాఫీ విత్ కరణ్ సీజన్ 9 వేదికపై భర్త విజయ్ దేవరకొండతో కలిసి పాల్గొన్న రష్మిక తన కెరీర్ ప్రయాణంలోని అనుభవాలను పంచుకుంది. "నేను దక్షిణ భారతదేశానికి చెందిన అమ్మాయిని.. నా మాటల్లో దక్షిణాది యాస ఉండటంలో తప్పేంటి?" అంటూ తనను విమర్శించేవారికి సూటిగా ప్రశ్నించింది. ఒక్క భాషకో, ఒక్క సినీ పరిశ్రమకో పరిమితం కావడం తనకు ఇష్టం లేదని, అన్ని భాషల్లో నటిస్తూ విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించాలన్నదే తన లక్ష్యమని చెప్పింది. యానిమల్, చావా, కాక్‌టెయిల్ 2 వంటి చిత్రాల్లో తన యాసపై వచ్చిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తన ప్రాంతపు గుర్తింపును దాచుకోవాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేసింది. అంతేకాదు, తన పాత్రకు మరో డబ్బింగ్ ఆర్టిస్ట్ గొంతు బాగుంటుందని దర్శకులు భావిస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ముందుగానే చెబుతానని వెల్లడించింది. అయితే ఇప్పటివరకు తన పాత్రలకు తానే డబ్బింగ్ చెప్పాలని దర్శకులు కోరడం గర్వంగా భావిస్తున్నానని తెలిపింది. ఒక్కో భాషలో డైలాగులు పలకడం వెనుక ఎంతో శ్రమ ఉందని, ఆ కష్టానికి గుర్తింపు లభిస్తే అంతకంటే ఆనందం మరొకటి ఉండదని చెప్పింది. యానిమల్ వంటి భారీ చిత్రాలతో పాటు ది గర్ల్‌ఫ్రెండ్ లాంటి భిన్నమైన కథల్లో భాగం కావడం నటిగా తనకు ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొంది.



# జైలర్ 2కు బన్నీ ఫిదా

## కూలెస్ట్ హిట్ అంటూ ప్రశంసలు!

సూపర్‌స్టార్ రజనీకాంత్ మాస్ మేనియా మరోసారి వెండితెరపై ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధమవుతుంటే.. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలతో జైలర్ 2 క్రేజ్ మరింత పెరిగింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై బన్నీ సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ స్టార్ పవర్, స్టైల్, స్వాగ్, ఆరా అద్భుతంగా ఆవిష్కృతమయ్యాయని ప్రశంసిస్తూ.. ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచే కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను అభివర్ణించారు. ముఖ్యంగా సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరుపై బన్నీ ప్రశంసల వర్షం కురిపించారు. "బ్రదర్.. అదరగొట్టేశావ్!" అంటూ ఆయన సంగీతానికి కితాబిచ్చారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాత కృషిని కూడా అభినందించిన అల్లు అర్జున్.. నెల్సన్ దిలీప్‌కుమార్‌ను అసలైన షోమ్యాన్‌గా కొనియాడారు. ఆయన తెరకెక్కించిన చిత్రం బాంబులా పేలిన కూలెస్ట్ హిట్ అంటూ ప్రశంసించారు. కూలీ తర్వాత రజనీ నుంచి వస్తున్న ఈ చిత్రం అభిమానుల్లో భారీ అంచనాలు రేకెత్తిస్తోంది. బన్నీ ప్రశంసలతో ఆ అంచనాలకు మరింత ఊపు వచ్చింది.

# హనుమాన్ హీరో పెళ్లి!

## నవంబరులో నిశ్చితార్థం.. ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్?




వెండితెరపై సూపర్‌హీరోగా అదరగొట్టి, కోట్లాది మంది అభిమానుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న యువ కథానాయకుడు తేజ సజ్జా జీవితంలో ఇప్పుడు కొత్త అధ్యాయం మొదలుకానుందా? హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఈ యంగ్ హీరో త్వరలోనే పెళ్లి కొడుకుగా మారబోతున్నారనే వార్త టాలీవుడ్‌లో ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం ది ట్రైటర్స్ తెలుగు కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న తేజ.. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం చేసుకోనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. నవంబర్‌లో నిశ్చితార్థం, డిసెంబర్‌లో పెళ్లి జరగవచ్చని సమాచారం. అయితే ఈ తేదీలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ ప్రైవేట్‌గా ఉంచే తేజ.. పెళ్లి వేడుకను కూడా నిరాడంబరంగా, ఆత్మీయుల మధ్యే జరుపుకోవాలని భావిస్తున్నారట. రాజస్థాన్ వివాహం తర్వాత హైదరాబాద్‌లో టాలీవుడ్ ప్రముఖుల కోసం ప్రత్యేక రిసెప్షన్ నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు కెరీర్ పరంగానూ తేజ చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నారు. జాంబీ రెడ్డి నెక్స్ట్ ఎల్‌వీఎల్‌తో పాటు, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కనున్న జై హనుమాన్‌లోనూ కనిపించనున్నారు. ఇందులో హనుమంతు పాత్రలో మరోసారి అలరించనుండగా, రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటించనున్నారు.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.